




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY







SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 266 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ బుధవారం 17 జూన్ 2026 పేజీలు : 12 వెల : 2/-






## 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో

# ఏపీదే పేటెంట్


- భారత్‌కు ఎకనమిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్
- రెండో నివాసంగా అమరావతిని ఎంచుకోండి
- సింగపూర్ పారిశ్రామికవేత్తలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు
- సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ రోడ్ షోలో పాల్గొన్న సీఎం

**సింగపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** భూమి, నీరు, మౌలిక వసతులు, అత్యుత్తమ పాలసీలతో పెట్టుబడులకు ఏపీ అత్యంత అనుకూల స్థానమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఏపీదే పేటెంట్ అని, పెట్టుబడులకు ఎంతో సురక్షితమని స్పష్టం చేశారు. ఈ ఏడాది విశాఖలో తలపెట్టిన పార్టనర్షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో సీఐఐ నిర్వహించిన బిజినెస్ రోడ్ షోలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ 'సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌కు మంచి సంబంధాలున్నాయి. సింగపూర్

మిగతా .. 2లో..

## సీబీఎన్ @ 361 డిగ్రీస్ పుస్తకం

### ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు



**సింగపూర్, విశ్వం వాయిస్ న్యూస్ :** సీబీఎన్@361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి పుస్తకాన్ని

మిగతా .. 2లో..

## మిషన్ గోదావరి క్లీన్ ప్రాజెక్టుకు

# కేంద్రం మద్దతు

- గోదావరి కాలుష్యంపై అధ్యయనానికి కేంద్ర బృందం
- మధ్యప్రదేశ్ నుంచి రాష్ట్రానికి 50 అడవి దున్నలు (ఇండియన్ గోర్)
- నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ లో బేస్ క్యాంపుల పెంపు అరణ్యారామం ఏర్పాటుకు అనుమతులు ఇచ్చినందుకు కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌కి కృతజ్ఞతలు
- గ్రీన్ ఇండియా మిషన్ కింద గ్రేట్ గ్రీన్ వాల్ కి సహకారం
- 8 విజ్ఞప్తులకు కేంద్రం నుంచి సానుకూల స్పందన
- కేంద్ర అటవీ పర్యావరణ శాఖల మంత్రితో భేటీ అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** 'మిషన్ గోదావరి క్లీన్ ప్రాజెక్టు మద్దతుగా కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి రంగంలోకి దిగనుంద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, అటవీ పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. పుష్కరాల నేపథ్యంలో గోదావరి కాలుష్య నివారణకు కేంద్ర ప్రభుత్వ సహకారం కోరిన వెంటనే కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుల్ని పంపి కాలుష్య నివారణ చర్యలకు సహకరించేందుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ అంగీకారం తెలిపినట్టు చెప్పారు. అటవీశాఖ కామన్ ఫెసిలిటీ సెంటర్ నూతన అరణ్యారామం నిర్మాణంతోపాటు బేస్ క్యాంపుల పెంపు,

మిగతా .. 2లో..

## వెలిగొండ నిర్వాసితులకు

# ఆర్అండ్ఆర్ పరిహారం

- అదనపు బడ్జెట్ లో 905 కేటాయించిన చంద్రబాబు
- నల్లమలసాగర్ నింపడమే లక్ష్యంగా వెలిగొండ పనులు
- టన్నెల్స్ లో లైనింగ్, టిబిఎం తొలగింపు ముమ్మరం
- క్షేత్రస్థాయిలో పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు



**వెలిగొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెలలో సిఎం చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ పరిహారం అందిస్తాం అని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. నల్లమలసాగర్ రిజర్వాయర్‌లో నీళ్ళు నింపడానికి నిర్వాసితుల పునరావాసానికి అదనపు బడ్జెట్‌లో 905 కోట్లు కేటాయించాలని స్పష్టం చేశారు. మంగళవారం అధికారులతో కలసి డోర్నాలలో వెలిగొండ ప్రాజెక్టు జంట సొరంగాల్లోకి వెళ్ళి టన్నెల్ లైనింగ్, టన్నెల్ బోరింగ్ మెషిన్

మిగతా .. 2లో..

# జూలై మూడో వారంలో తల్లికి వందనం

- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల పెంపునకు ప్రత్యేక చర్యలు
- జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం నిర్వహణ - సెట్‌లను సకాలంలో నిర్వహించండి
- విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సాయం త్వరితగతిన అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య అధికారులతో మంత్రి లోకేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం, బడి పిలుస్తోంది, షైనింగ్ స్టార్స్, మెగా పీటీఎం, యోగాంధ్ర, టెట్ నిర్వహణ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి

మిగతా .. 2లో..

## రెండేళ్లలో శాంతిభద్రతలు, మహిళా రక్షణ, డ్రగ్స్

# నియంత్రణలో గణనీయ పురోగతి

- ప్రజా భద్రత, సైబర్ రక్షణ, విపత్తు నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ విశిష్ట పురోగతి
- సాంకేతికత, పారదర్శకత, జవాబుదారీతనంతో సమగ్ర సంస్కరణలు
- రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం గత రెండేళ్ల కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాల అరికట్టడం, విపత్తుల నిర్వహణ, జైళ్ల సంస్కరణలు, పోలీసు సంక్షేమం వంటి అన్ని రంగాల్లో సమగ్ర సంస్కరణలను చేపట్టి విశేష ఫలితాలు సాధించిందని రాష్ట్ర హోం వ్యవహారాలు మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి అనిత వంగలపూడి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ

మిగతా .. 2లో..

## దక్షిణ కోస్తాంధ్ర వరకు

# విస్తరించిన ద్రోణి



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 'బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వార్షలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయి. మరోవైపు ఎండ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఎండలో తిరగరాదు' అని సూచించింది.

## కిషన్‌రెడ్డి గారూ.. ఎక్కడికైనా వస్తా..

# మీ కాల్ కోసం వెయిటింగ్

### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. మెట్రో రైలు ప్రాజెక్టు వ్యవహారంలో ఇటీవల సీఎం చేసిన విమర్శలపై కిషన్‌రెడ్డి స్పందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైల్‌కు ఐఆర్ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడా లని కిషన్‌రెడ్డిని కోరారు. "సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా నేను ఎప్పుడూ సిద్ధమే. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వీలైనంత త్వరగా భేటీ ఏర్పాటు చేయించాలి. ఆ సమావేశానికి

మిగతా .. 2లో..

## నేను లేకుంటే

# ఇజ్రాయెల్ ఉండేది కాదు

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్ భద్రతకు సంబంధించి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. తాను జోక్యం చేసుకోకుంటే ఇజ్రాయెల్ ఎప్పుడో నాశనమయ్యేదని అన్నారు. లెబనాన్ విషయంలో ఆ దేశం అనుసరిస్తున్న తీరుతో సంతోషంగా లేనని చెప్పారు. జీ-7 సదస్సులో పాల్గొనేందుకు ఫ్రాన్స్ వచ్చిన ట్రంప్.. ఖతార్ ఎమిర్‌తో సమావేశం సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. లెబనాన్ అంశంలో నెతన్యాహు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. "బీబీ (నెతన్యాహు)తో

మిగతా .. 2లో..

## తెలంగాణ అభివృద్ధిపై

# మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశవ్యాప్తంగా మిగతా మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే హైదరాబాద్ మెట్రోకు కేంద్ర ప్రభుత్వం సహకారమందిస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సాంకేతిక, ఆర్థిక విషయాలపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వాలు సహకరిస్తే ప్రాజెక్టులు సాకారమవుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విమర్శల నేపథ్యంలో దిల్లీలో కిషన్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. తాను వద్దంటే ప్రాజెక్టులు ఎక్కడా ఆగవని చెప్పారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అనేక మార్పులను రాష్ట్రానికి కేంద్రం

మిగతా .. 2లో..

## నీట్ రీటెస్ట్..

## టెలిగ్రామ్ యాప్‌ను

# బ్లాక్ చేసిన కేంద్రం





**విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ యూజీ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారం దేశ వ్యాప్తంగా దుమారం లేపిన నేపథ్యంలో.. రీ ఎగ్జామ్ విషయంలో కేంద్రం అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈనేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌ను కేంద్రం బ్లాక్ చేసింది. నీట్ రీటెస్ట్ జూన్ 21న నిర్వహిస్తుండగా.. జూన్ 22 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని వెల్లడించింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సుల మేరకు ఈ తాత్కాలిక ఆంక్షలు విధించింది. అలాగే జూన్ 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను భారత్‌లో డిసేబుల్ చేయాలని టెలిగ్రామ్‌ను ఆదేశించింది. టైమ్‌స్టాంప్‌ను అలాగే ఉంచుతూ గతంలో పోస్ట్ చేసిన మెసేజ్‌లను సవరించడంతో పాటు, పేపర్ లీక్ సాక్ష్యాలను, నిందితులను తారుమారు చేసేందుకు ఈ ఫీచర్‌ను

మిగతా .. 2లో..

# వెన్నుపోటుదారుడు జగనే

- ఏపీకి భవిష్యత్తు కూటమితోనే.. - గర్వపడేలా సీఎం చంద్రబాబు రెండేళ్ల పాలన
- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**పుట్టపర్తి/శ్రీసత్యసాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రంలో విధ్వంస పాలనతో ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసి చరిత్రలో వెన్నుపోటు దారుడిగా నిలిచి పోయారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత విమర్శించారు. కూటమి ప్రభుత్వంతోనే ఏపీ

మిగతా .. 2లో..

# అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

- యోగా దినోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యోగా గురువు బాబా రాందేవ్ హాజరు
- ఐజీఎంసీ స్టేడియంతోపాటు డా. బిఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ ఏర్పాట్లు కలెక్టర్ జి.లక్ష్మీశ



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జూన్ 21న విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఏపీదే పేటెంట్

నిర్మాత లీ క్వాన్ యూ అంటే నాకు చాలా అభిమానం. 3 దశాబ్దాలుగా సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్ తయారు చేసి ఇచ్చింది. బ్లూ, గ్రీన్ రాజధానిగా ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించి అందించింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నాం. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతం అని స్పష్టం చేస్తున్నా. సింగపూర్ పారిశ్రామిక వేత్తలు అమరావతిని, ఆంధ్రప్రదేశ్‌ను రెండో నివాసంగా ఎంచుకోవాలి.' అని అన్నారు.

**స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు**

'ఏపీలో పరిశ్రమలకు భూమి కేటాయింపు, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నాం. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ అయిన ఆర్సెలార్ మిట్టల్‌కు అనతికాలంలోనే అన్ని అనుమతులు వేగంగా ఇచ్చాం. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుంది. గూగుల్ క్లౌడ్ ఏఐ డేటా హబ్ కూడా ఏర్పాటు అవుతోంది. ఆ సంస్థకు గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించాం. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నాం. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయి. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభించనుంది. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్సిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగింది. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయి. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నాం

**ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్**

వికసిత్ భారత్ 2047 విజన్‌లాగే స్వర్ణాంధ్ర 2047 విజన్‌కు రూపకల్పన చేశాం. త్వరలోనే భారత ఎకనామిక్ పవర్ హౌస్‌గా ఆంధ్రప్రదేశ్ మారుతుంది. ప్రపంచ ఆర్థిక శక్తిగా భారత్ వేగంగా ఎదుగుతోంది. సుదీర్ఘమైన తీరప్రాంతం, అరుదైన ఖనిజాలు, పర్యాటక ప్రాంతాలు ఏపీ సొంతం. ఆక్వా, హార్టికల్చర్, వ్యవసాయం, సేవల రంగంలో ఏపీ కీలకమైన రాష్ట్రంగా ఉంది. దేశంలోనూ, రాష్ట్రంలోనూ సుస్థిరమైన ప్రభుత్వాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా వివిధ దేశాలు సంక్షోభాలను ఎదుర్కొంటున్నాయి. పూర్తి స్థాయి సన్నద్ధతతో ఈ సంక్షోభాన్ని కూడా భారత్ సమర్థంగా ఎదుర్కోగలిగింది. ఏపీ నుంచి ఎగుమతులు పెంచేందుకు మేం విస్తృతంగా ప్రయత్నాలు చేస్తున్నాం. దీనికి అనుగుణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధి కోసం స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించేలా పనిచేస్తున్నాం. పారిశ్రామిక అనుకూల పరిస్థితులను కల్పించేలా 26 పాలసీలు అమలు చేస్తున్నాం. ఏపీలో భూమి లభ్యత, నీటి లభ్యత ఉంది. కృష్ణా, గోదావరి నదుల ద్వారా వివిధ ప్రాంతాలకు నీటి సరఫరా ఉంది. పారిశ్రామికంగా మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున కల్పిస్తున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

**గ్లోబల్ నగరాలకు ఏపీ కనెక్టివిటీ**

'ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూర్ అనే విధానం తెచ్చాం. అలాగే ఎంఎస్ఎంఈ సహా వివిధ పరిశ్రమల్లో తయారయ్యే ఉత్పత్తుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాం. రియల్ టైమ్ గవర్నెన్సు ద్వారా ఎక్కడా జాప్యం లేకుండా అనుమతులు వేగంగా వచ్చేలా చూస్తున్నాం. ఏపీకి ఉన్న వెయ్యి కిలోమీటర్లకు పైగా తీర ప్రాంతంలో 6 ఆపరేషనల్ పోర్టులు ఉన్నాయి. ఈ పోర్టులను దేశంలోని వివిధ ప్రాంతాలకు, విదేశీ పోర్టులకు కనెక్టు చేసేలా ప్రయత్నాలు చేస్తున్నాం. 7 ఆపరేషనల్ ఎయిర్ పోర్టులు ఏపీలో ఉన్నాయి. భోగాపురం లాంటి అంతర్జాతీయ విమానాశ్రయంతో గ్లోబల్ నగరాలకు కనెక్టివిటీ ఏర్పడుతుంది. లాజిస్టిక్స్, అగ్రికల్చర్, సివిల్ ఏవియేషన్, ఎనర్జీ లాంటి వివిధ అంశాల్లో ఫంక్షనల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తున్నాం. ఏపీలో ఉన్న పోర్టులను దేశంలోని ఇతర ప్రాంతాలు అనుసంధానించేలా రహదారి, రైల్ నెట్వర్క్‌ను కూడా పెద్ద ఎత్తున నిర్మిస్తున్నాం. ఎలక్ట్రానిక్స్, స్పేస్, ఏరోస్పేస్, డ్రోన్, డిఫెన్స్ క్లస్టర్లతో పాటు రాష్ట్రంలోని 175 చోట్ల నియోజకవర్గ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నాం. ఈ పారిశ్రామిక పార్కులకు నీరు, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాయలసీమలోని పుట్టపర్తి వద్ద 5వ తరం ఫైటర్ జెట్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ కూడా వస్తోంది. ఈవీల వినియోగం పెంచటం ద్వారా కాలుష్యాన్ని తగ్గించేలా ప్రయత్నాలు చేస్తున్నాం' అని ముఖ్యమంత్రి అన్నారు.

**నాలెడ్జ్ హబ్‌గా అమరావతి**

'అమరావతిని ఎడ్యుకేషన్, నాలెడ్జ్ హబ్‌గా తయారు చేయటంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలను కనెక్ట్ చేస్తాం. హైస్పీడ్ రైల్ నెట్వర్క్ కూడా అమరావతిని హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై లాంటి నగరాలను కనెక్టు చేస్తుంది. బ్లూ, గ్రీన్ సిటీగా అమరావతిని నిర్మించటం తోపాటు ఈవీల వినియోగం, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నాం. అమరావతిలోనే ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సంస్థలు 133 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తున్నాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికల్లా క్వాంటం అమరావతిలో కంప్యూటర్ పనిచేయటం ప్రారంభిస్తుంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఆవిష్కరణల్ని, స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నాం. ప్రాజెక్టులు పెట్టే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా మా ప్రభుత్వం సహకారం అందిస్తుంది. త్వరలోనే విశాఖ సమీపంలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. ఏపీలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఉన్నాయి. దేవాలయాలు, పర్యాటక, బుద్ధిస్ట్ సర్క్యూట్‌లు ఉన్నాయి. అక్వా, వ్యవసాయం, హార్టికల్చర్‌లో ఏపీ అగ్రస్థానంలో ఉంది. పెద్ద ఎత్తున ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు అవకాశం ఉంది. పెద్దఎత్తున ప్రకృతి సేద్యం ద్వారా వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను పండిస్తున్నాం. ఏపీకి వచ్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ను పరిశీలించి అప్పుడు పెట్టుబడులు పెట్టాలని పిలుపునిస్తున్నాం. పెట్టుబడులు పెట్టడానికి ఇది సువర్ణ అవకాశం. ఇండియా గ్రోత్ స్టోరీలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

**భవిష్యత్ అంతా స్టార్టప్‌లదే**

'భౌగోళిక రాజకీయ పరిస్థితుల కారణంగా ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి పెట్టుబడులు భారతదేశానికి వస్తున్నాయి. ఇందులో 25 శాతం వరకే ఏపీలో ప్రాజెక్టులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. భారత్‌లో ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో మౌలిక సదుపాయాలు ఉన్నాయి. పోర్టులు, ఎయిర్ పోర్టులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలను అనుసంధానం చేస్తున్నాయి. అంతర్జాతీయంగా ఉత్పన్నమైన పరిస్థితులను ఎదుర్కునేలా కొన్ని దేశాలు సొంతంగా నిధిని ఏర్పాటు చేశాయి. సింగపూర్ కూడా సావరిన్ ఫండ్స్‌ను ఏర్పాటు చేసుకున్నాయి. సమీప భవిష్యత్ అంతా స్టార్టప్ లదే. వాటిని ప్రోత్సహిస్తే పెద్దఎత్తున ఉత్పత్తికి అవకాశం ఉంటుంది. పెద్ద కంపెనీలు, సంపన్నులు స్టార్టప్ లలో పెట్టుబడి పెట్టడం విజయవంతమైన మార్గంగా చూస్తున్నాయి. అమరావతిలో ఫైనాన్షియల్ డిస్ట్రిక్టను ఏర్పాటు చేశాం. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ ఆర్థిక నగరంలో ఉంటాయి' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మంత్రి పి.నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీబీఎన్ @ 361 డిగ్రీస్ పుస్తకం

**ఆవిష్కరించిన సీఎం చంద్రబాబు**

విడుదల చేశారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని రేపటికోసం దినపత్రిక చీఫ్ ఎడిటర్ శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిండా ఆర్డెర్న్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సీఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని.. ఏపీ అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని రచయిత శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ వివరించారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కేవీ సత్యనారాయణ, శంకర ప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

## మిషన్ గోదావరి క్లీన్ ప్రాజెక్టుకు కేంద్రం మద్దతు

గ్రేట్ గ్రీన్ వాల్ కి మద్దతు, ఒడిశా నుంచి కుంకీ ఏనుగులు, మధ్యప్రదేశ్ రాష్ట్రం నుంచి 50 అడవి దున్నలు రాష్ట్రానికి రప్పించేందుకు సహకారం, తగ్గుతున్న ఆడ పులుల పెంపు చర్యలు తదితర 8 అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించినట్టు తెలిపారు. మంగళవారం ఉదయం కేంద్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ తో సమావేశం అయ్యారు. అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడుతూ "ఇటీవల అటవీ శాఖలో అరణ్యారామం పేరిట నిర్మించ తలపెట్టిన కామన్ ఫెసిలిటీ సెంటర్ అరణ్యంకు అనుమతులు మంజూరు చేసినందుకు భూపేంద్ర యాదవ్‌కి కృతజ్ఞతలు తెలిపేందుకు వచ్చాం. దీంతో రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖకు సంబంధించి 8 అంశాలకు మద్దతు కోరాం. నూతన అరణ్యం భవన్ లో మానవ వన్యప్రాణి సంఘర్షణ నివారణ కేంద్రం హనుమాన్ మానిటరింగ్ సెంటర్, గ్రేట్ గ్రీన్ వాల్ పర్యవేక్షణ కేంద్రం, ఫారెస్ట్ ఫైర్ కమాండ్ కంట్రోల్ సెంటర్, స్టేట్ టైగర్ మానిటరింగ్ వంటి అత్యాధునిక విభాగాలు ఏర్పాటు కానున్నాయి. వీటితో పాటు చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లోకి సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చేస్తున్న ఏనుగుల రాకపోకల మానిటరింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాం. దీని వల్ల ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కల్పించే అవకాశం లభిస్తుంది. దీనితో పాటు నాగార్జున సాగర్, శ్రీశైలం టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో బేస్ క్యాంపులు పెంచుకునేందుకు అనుమతి కోరాం. ప్రస్తుతం 90 బేస్ క్యాంపులు ఉండగా ఆ సంఖ్యను 150కి పెంచుకోవాల్సి ఉంది. అందుకోసం 300 మంది గార్డ్స్ అదనంగా అవసరం అవుతారు. గార్డ్స్ గా స్థానిక చెంచు యువతే ఉంటారు. వారు అడవుల్లో సులభంగా తిరిగేందుకు ద్విచక్రవాహనాలు సహా బేస్ క్యాంపుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి మద్దతు ఇచ్చేందుకు భూపేంద్ర యాదవ్ అంగీకారం తెలిపారు. జీవ నది అయిన పవిత్ర గోదావరి నదిని మున్సిపల్, పారిశ్రామిక కాలుష్యం నుంచి పూర్తిగా రక్షించి స్వచ్ఛమైన నదీ వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు అవసరం అయిన సలహాలు, సూచనలు చేయాలని కోరాం. గోదావరి కాలుష్యంపై అధ్యయనానికి కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులను పంపుతామని భూపేంద్ర యాదవ్ హామీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అటవీ ప్రాంతంలో అంతరించిపోయిన అడవి దున్నల (ఇండియన్ గోర్)ను పునరుద్ధరణ చర్యలకు సహకారం కోరాం. మధ్యప్రదేశ్ నుంచి 50 అడవి దున్నలను ఇప్పించేందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో వాటిని రాష్ట్రానికి పంపేందుకు వారు పెద్ద మనసుతో ఒప్పుకున్నారు. ఇండియన్ గోర్ సంరక్షణ కోసం ఇప్పటికే ఇంక్లోజర్లు కూడా సిద్ధం చేశాం. నేను స్వయంగా మధ్యప్రదేశ్ వెళ్లి మరోసారి విజ్ఞప్తి చేస్తాను. దీంతో పాటు రాష్ట్రంలో మగ పులుల సంఖ్య పెరిగి, ఆడ పులుల సంఖ్య తగ్గింది. దీని వల్ల జన్యుపరమైన సమస్యలు వస్తున్నాయి. అందుకోసం ఆరు ఆడ పులులను రాష్ట్రానికి తీసుకువచ్చేందుకు సహకారం కోరాం. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో మాట్లాడితే 4 ఆడ పులులు ఇచ్చేందుకు అంగీకరించారు. మధ్యప్రదేశ్ నుంచి మరో రెండు తీసుకోనున్నాం. పార్వతీపురం మన్యం జిల్లాలో అడవి ఏనుగుల బెడద నుంచి ప్రజల ప్రాణాలు, ఆస్తుల పరిరక్షణ చర్యల్లో భాగంగా ఒడిశా నుంచి శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు ఇప్పించాలని కోరాం. అక్కడ ప్రభుత్వం కూడా మా అభ్యర్థన పట్ల సుముఖత వ్యక్తం చేసింది. గ్రీన్ ఇండియా మిషన్ కింద రాష్ట్రానికి సహకారం అందించడంతో పాటు ఆంధ్రప్రదేశ్ లో ఉన్న 1,050 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతాన్ని తుపానులు, ఉప్పెనలు లాంటి ప్రకృతి వైపరీత్యాల నుచి రక్షించుకునేందుకు, తీర ప్రాంత కోత నివారణ చర్యల్లో భాగంగా గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టుని ముందుకు తీసుకువెళ్తున్నాం. ఇప్పటికే మూడు జోన్లుగా విభజించి 450 కిలోమీటర్ల మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఈ కార్యక్రమానికి కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయాలని కోరగా, మిష్టీ నుంచి నిధులు ఇచ్చేందుకు అంగీకరించారు. భావితరాల భవిత కోసం పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ ని అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో ముందుకు వెళ్తాం. గోదావరి కాలుష్య నివారణ అంశంపై కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ సహకారం కూడా కోరనున్నాం" అన్నారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారితో పాటు జనసేన పార్టీ ఎంపీలు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, లింగమనేని రమేష్, శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ , అటవీ పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ తదితరులు ఉన్నారు.

## ఆర్అండ్ఆర్ పరిహారం

తొలగింపు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెలిగొండ ప్రాజెక్టులో హెడ్ రెగ్యులేటర్ల రిటైనింగ్ వాల్, వింగ్స్, రిటర్న్ పనులు పూర్తి చేశాం అని తెలిపిన మంత్రి నిమ్మల కొల్లంవాగు నుండి 1 టిఎంసి నీరు టన్నెల్స్ లోకి చేరేలా 1.80లక్షల క్యూబిక్ మీటర్ల కు గానూ, ఇప్పటికి 58 వేల క్యూబిక్ మీటర్ల మక్ తొలగించాం అని, అదేవిధంగా టన్నెల్-1 లో నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న 1. 20 లక్షల క్యూబిక్ మీటర్ల మక్ తొలగింపు పనులలో ఇప్పటికి 40 వేల క్యూబిక్ మీటర్లు తొలగించాం అని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 20 నెలలో టన్నెల్-2లో 7 కి.మీ లైనింగ్ కి గానూ, 5.5 కి.మీ లైనింగ్ పనులు పూర్తి చేశాం అని, మిగిలిన 1.5 కి.మీ లైనింగ్, జూలై చివరి నాటికి పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయి స్పష్టం చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, యర్రగొండపాలెం టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ ఎరిక్షన్ బాబు, జలవనరుల శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, వెలిగొండ ప్రాజెక్ట్ సీఈ రమేష్ బాబు, ఎస్.ఈ అబూతలేం, మరియు ఇతర ఉన్నతాధికారులు, ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జూలై మూడో వారంలో తల్లికి వందనం

వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికపై ఈ సందర్భంగా మంత్రి లోకేష్ ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థుల ప్రవేశాల పెంపు పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి ఆదేశించారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి.. తల్లుల ఆధార్ వెరిఫికేషన్ ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని, జులై 3వ వారంలో పథకం అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వివరించారు. జూన్ 29న షైనింగ్ స్టార్స్ కార్యక్రమం, జులై మూడో వారంలో మెగా పీటీఎం నిర్వహణకు సమావేశంలో నిర్ణయించారు. మిగులు ఉపాధ్యాయుల పని సర్దుబాటుపైనా సమావేశంలో చర్చించారు.

**ఉన్నత విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష**

రాష్ట్రంలో ఎప్ సెట్, పాలిసెట్, ఆర్ సెట్ వంటి 12రకాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లకు ఎటువంటి జాప్యం లేకుండా సాధ్యమైనంత త్వరగా నోటిఫికేషన్లు విడుదల చేసి, నిర్ణీత సమయంలో అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించే సెట్స్, పొరుగు రాష్ట్రాల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ల తేదీలను కూడా గమనంలోకి తీసుకొని విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా రాష్ట్రంలోని వివిధ సెట్ ల తేదీలను ఖరారు చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్ల పెంపును పరిశీలించాలని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్, సివిల్ విభాగాల సీట్లకు డిమాండ్ ఉందని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కు సంబంధించి 254 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో 1.88లక్షల సీట్ల భర్తీకి గాను ఎప్ సెట్ నోటిఫికేషన్ కు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో యూనివర్సిటీల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్న థాపర్ ఇనిస్టిట్యూట్, జేమ్స్ కుక్ యూనివర్సిటీ, మెల్ బోర్న్ యూనివర్సిటీ, మేధావి స్కిల్ యూనివర్సిటీ, జేఎస్ఎస్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలతో చర్చల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జే.శ్యామలరావు, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీమ్ అన్సారియా, ఉన్నతవిద్య కమిషనర్ నారాయణ్ భరత్ గుప్తా, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## నియంత్రణలో గణనీయ పురోగతి

గత ప్రభుత్వ హయాంలో రాజకీయ ప్రయోజనాలకు పరిమితమైన వ్యవస్థలను ప్రజా సేవా దృక్పథంతో పునర్నిర్మిస్తూ, ప్రజలకు జవాబుదారీగా పనిచేసే పరిపాలనా వ్యవస్థను ప్రభుత్వం నెలకొల్పిందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ అనేది కేవలం అధికార ప్రదర్శన కాదని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకునే బాధ్యతగా ప్రభుత్వం విశ్వసిస్తోందని ఆమె తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, పోలీసు-ప్రజల సమన్వయం, సాంకేతికత వినియోగం, పారదర్శక పరిపాలన, వేగవంతమైన స్పందన, చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అత్యంత సురక్షిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా, నేరం జరగకుండా ముందుగానే నిరోధించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రజల భద్రత, మహిళల గౌరవం, యువత భవిష్యత్తు, సమాజ శాంతి కోసం రాజీపడకుండా తమ ప్రభుత్వం పనిచేస్తుందని అని మంత్రి స్పష్టం చేశారు. శాస్త్రీయ దర్యాప్తుకు వెన్నెముకైన ఫోరెన్సిక్ వ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేస్తోందన్నారు. జనవరి నుండి మే వరకు 7,793 కేసులకు సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణలు పూర్తి చేయబడ్డాయన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోరెన్సిక్ ప్రయోగశాలలను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ, సీసీటీవీ పర్యవేక్షణ, ట్రాఫిక్ అమలు బలోపేతం తదితర చర్యలు చేపట్టడంతో ప్రమాదాల తీవ్రత తగ్గుముఖం పట్టిందని మంత్రి తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం లేకుండా సమర్థవంతమైన శాంతిభద్రతలు సాధ్యం కాదనే భావనతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. 6,000 మందికి పైగా పోలీసు నియామకాలు, 505 మంది గెజిటెడ్ అధికారులకు పదోన్నతులు, కానిస్టేబుల్ శిక్షణార్థుల స్టైపెండ్‌ను రూ.4,000 నుండి ?7,500కు పెంపు చేయడం జరిగిందన్నారు. ఇందు కోసం రూ.7.5 కోట్ల అదనపు నిధుల కేటాయింపు చేయడం జరిగిందన్నారు. జైలు కేవలం శిక్షా కేంద్రాలు మాత్రమే కాకుండా పునరావాస కేంద్రాలుగా మారాలనే లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి శిక్షణ, మానసిక ఆరోగ్య సేవలు, డీ-అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ఖైదీలు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించబడుతోందన్నారు.గత రెండేళ్లలో విపత్తు నిర్వహణ వ్యవస్థను పూర్తిగా పునర్వ్యవస్థీకరించడం జరిగిందని మంత్రి తెలిపారు. 26 చీణ=ఖీ బృందాలు, 22 ఎాణ=ఖీ బృందాలు, డ్రోన్ ఆధారిత పర్యవేక్షణ, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు, రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా ప్రాణనష్టం తగ్గించే దిశగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. 872 మంది రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు ప్రత్యేక శిక్షణలు నిర్వహించబడ్డాయన్నారు. అగ్నిప్రమాదాల సమయంలో వేగవంతమైన స్పందనతో పాటు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అత్యాధునిక పరికరాలు, సాంకేతిక సదుపాయాలతో అగ్నిమాపక శాఖను బలోపేతం చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. నేరస్థులకు శిక్షలు ఖరారయ్యేలా ప్రాసిక్యూషన్ వ్యవస్థను బలోపేతం చేయడంతో 279 కీలక కేసుల్లో విజయవంతమైన తీర్పులు, 8 మందికి మరణదండన, 3 మందికి యావజ్జీవ కారాగార శిక్ష, 42 మందికి 20 సంవత్సరాలకు పైగా శిక్ష, 14 మందికి 14 సంవత్సరాల జైలు శిక్ష విధించబడ్డాయని మంత్రి తెలిపారు. అదనపు డిజి మధుసూధన రెడ్డి, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార విశ్వజిత్, ఎస్.పి.ఎఫ్. డిజి డా.త్రివిక్రమ వర్మ, హోం శాఖ స్పెషల్ సెక్రటరీ విజయకుమార్, ఈగల్ ఛీఫ్ ఐజి రవికృష్ణ, ఐజిలు శ్రీకాంత్, రాజకుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ఎండి ప్రకర్ జైన్, అగ్నిమాపక శాఖ డైరెక్టర్ వెంకట రమణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మీ కాల్ కోసం వెయిటింగ్

సంబంధించి మీ కాల్ కోసం ఎదురు చూస్తాను. అన్ని పత్రాలతో వచ్చి స్పష్టత ఇస్తా. ఈ అంశంలో మీతో వ్యక్తిగత భేటీకి కూడా సిద్ధమే. ఎక్కడికైనా, ఎప్పుడైనా డాక్యుమెంట్లు, అధికారులతో వస్తాను" అని రేవంత్ పేర్కొన్నారు.

**బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై సీఎం సమీక్ష**

అంతకుముందు బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్టు అంశాలపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్-పుణె రైల్వే మార్గంలో అనంతగిరి వద్ద స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని.. అక్కడి నుంచి ఐటీ హబ్‌కు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. హైదరాబాద్-బెంగళూరు రైల్వేమార్గంలో ఫ్యూచర్ సిటీలో స్టేషన్ ఏర్పాటు చేయాలి. మన్ననూర్ వద్ద నల్లమల స్టేషన్, సోమశిల సమీపంలో స్టేషన్ ప్లాన్ చేయాలని సూచించారు. టూరిజం ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే లైన్ ఉండాలన్నారు. కాకతీయ సామ్రాజ్యం, వారసత్వ సంపద ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్టు ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఎయిర్‌పోర్టు ముందు రుద్రమదేవి, రుద్రదేవుడు, నంది విగ్రహంతో ఐలాండ్ ఉండాలన్నారు. ఎయిర్‌పోర్టు డిజైన్లపై దిల్లీ వెళ్లి ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులతో చర్చించాలని అధికారులకు సూచించారు.

## ఇజ్రాయెల్ ఉండేది కాదు

నాకు మంచి అనుబంధం ఉంది. లెబనాన్ విషయానికొస్తే ఆయన బాధ్యతగా ఉండాలి. ఆ దేశం ఒకప్పుడు గొప్ప దేశంగా ఉండేది. ప్రొఫెసర్లు, వైద్యులు, లాయర్లు ఉండే దేశం. ఇప్పుడు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. లెబనాన్, హెజ్‌బొల్లా విషయంలో ఇజ్రాయెల్ అనుసరిస్తున్న వైఖరి నాకు నచ్చలేదు. ఇప్పటికే ఆ ఒప్పందం పూర్తి కావాల్సింది. కానీ, అంతులేకుండా సాగుతూనే ఉంది" అని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో 42వేల మంది ప్రాణాలు కోల్పోయారని ట్రంప్ పేర్కొన్నారు. గతవారం ఇరాన్‌పై జరిపిన దాడులను ప్రస్తావించిన ట్రంప్.. మరో మార్గం లేకనే దాడులు చేయాల్సి వచ్చిందన్నారు. తాజా ఒప్పందం న్యాయమైందని అభివర్ణించారు. అయితే, ఒప్పందంలో భాగంగా ఇరాన్‌లో అమెరికా పెట్టుబడులు పెట్టనుందని వస్తోన్న వార్తలను తోసిపుచ్చారు. మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం పశ్చిమాసియాలో సానుకూల వాతావరణానికి మార్గం సుగమం చేస్తుందని ఖతార్ ఎమిర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు

సూచించిందన్నారు. ప్రాజెక్టులను దొడ్డిదారిన ఆపే సంస్కృతి భాజపాకు లేదని.. కాంగ్రెస్‌కే ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఎవరి కోసమూ ప్రాజెక్టులను అడ్డుకోబోమన్నారు. "తెలంగాణ అభివృద్ధి పట్ల మాకు చిత్తశుద్ధి ఉంది. గతంలో మెట్రో ఫేజ్-1కు కేంద్రం రూ.1,250 కోట్లు మంజూరు చేసింది. అనాలోచితంగా, దుందుడుకు ధోరణిలో సీఎం మాట్లాడటం సమంజసం కాదు. నాతో పాటు ప్రధాని మోదీ, కేంద్రానికి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్టిఫికెట్ అవసరం లేదు. మేం రేవంత్‌రెడ్డికి కాదు.. తెలంగాణ ప్రజలకు జవాబుదారీ. రాష్ట్ర అభివృద్ధి కోసం 12 ఏళ్లుగా పనిచేశాం.. ఇప్పుడూ పనిచేస్తాం. ఇచ్చిన హామీలను తు.చ. తప్పకుండా అమలు చేస్తున్నాం. తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధి పట్ల మాకెవరూ పాఠాలు చెప్పనక్కర్లేదు. తెలంగాణ బిడ్డగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశాను. దిల్లీకి వచ్చి రెండుసార్లు ధర్నా చేశాం. బిల్లు ఆమోదం పొందిన తర్వాతే ఏపీ భవన్‌లో ఆమరణ దీక్ష విరమించా. రైల్వేస్టేషన్ల అభివృద్ధి కోసం నాడు కేసీఆర్, నేడు రేవంత్‌రెడ్డికి లేఖలు రాశా. రేవంత్ కోరితే కాకుండా.. కేంద్ర ప్రభుత్వమే బాధ్యతగా తీసుకుని రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులు చేపట్టింది. ఎంఎంటీఎస్ ఫేజ్-2కు నాడు కేసీఆర్ సహకరించలేదు. అయినప్పటికీ ప్రధాని చేతులమీదుగా ప్రారంభించాం. తెలంగాణకు రాదనుకున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీని సాధించాం. రాష్ట్రాల్లో ఏ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నా అందరికీ కేంద్రం సహకారం అందిస్తోంది. మోదీ ఇస్తుంటే కిషన్‌రెడ్డి అడ్డుపడుతున్నారనడం దిగజారుడు రాజకీయాలే. 50 ఏళ్లు వడ్డీ లేకుండా రాష్ట్రానికి ఇటీవల సాస్కీ రుణాలను కేంద్రం మంజూరు చేసింది. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు ఏడీబీ రుణానికి కేంద్రం ఎన్వోసీ ఇచ్చింది. ఎన్‌సీడీసీ ద్వారా పదేళ్లుగా తెలంగాణకు రూ.లక్ష కోట్లు మంజూరు చేశాం. ధాన్యం కొనుగోళ్లకు రూ.37వేల కోట్లు మంజూరు చేసి.. ఇప్పటికే రూ.34వేల కోట్లు అందించాం" అని కిషన్‌రెడ్డి వివరించారు.

## వెన్నుపోటుదారుడు జగనే

ప్రజల భవిష్యత్తుకు భరోసా లభిస్తోందని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ సీఎం చంద్రబాబునాయుడు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వ పాలనలో జరుగుతున్న అభివృద్ధిపైనా, గత పాలనలో జరిగిన విధ్వంసంపైనా చర్చకు సిద్ధమని వైసీపీ నాయకులకు మంత్రి సవిత సవాల్ విసిరారు. పుట్టపర్తిలో మంగళవారం నిర్వహించిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు సహా పలువురు ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, పరిటాల సునీత, పల్లె సింధూర రెడ్డి, ఎంపీ బీకే పార్థసారథితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు ఏపీని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టడానికి రేయింబవళ్లు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రస్తుతం దేశంలోకి వస్తున్న పెట్టుబడుల్లో అత్యధిక శాతం ఏపీకే తరలొస్తున్నాయన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలుచేస్తూనే, రాజధాని అమరావతిని, పోలవరం ప్రాజెక్టు పనులను కూడా పూర్తి చేస్తున్నారన్నారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, దీపం -2 పథకాలతో పాటు అధికారంలోకి రాగానే పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు తమ ప్రభుత్వం పెంచిందన్నారు. కూటమిలో ఉన్న పార్టీల కార్యకర్తలు గర్వపడేలా రెండేళ్ల పాలన సాగిందని మంత్రి సవిత తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్ విధ్వంస పాలన చేశారని మంత్రి సవిత మండిపడ్డారు. అమ్మఒడి, పెన్షన్లు పెంపు పేరుతో ప్రజలను జగన్ వెన్నుపోటు పొడిచారన్నారు. 2019 ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి, వాటిని అమలు చేయడంలో జగన్ రెడ్డి విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాల అమలుకు ప్రాధాన్యమిచ్చిందన్నారు. బీసీ సంక్షేమ శాఖ తరపున గతంలో కూడా అమలు చేయని ఎన్నో పథకాలను అమలు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ప్రభుత్వ విద్యా సంస్థలతో పాటు హాస్టళ్లు, గురుకులాల్లో ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ లో అత్యుత్తమ ఫలితాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలొచ్చారు.

## అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన

తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ బాబా లు హాజరు కానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు కే.ఎస్. విశ్వనాథన్, నగర మున్సిపల్ కమిషనర్ హెచ్.ఎమ్ ధ్యానచంద్ర, నగర డీసీపీ కృష్ణకాంత్ పటేల్, ఏడీసీపీ ఎన్బీఎమ్ మురళీ కృష్ణ, సెకండరీ హెల్త్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు మంతెన వెంకట సత్యనారాయణ రాజు, ప్రకృతి వైద్య ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు, యోగా గురువు బాబా రాందేవ్ ప్రతినిధులు, జిల్లా అధికారులతో కలిసి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం డా. బీఆర్. అంబేద్కర్ కళా వేదికకు చేరుకుని అక్కడ చేస్తున్న ఏర్పాట్లు, ప్రొటోకాల్ తదితర అంశాలపై వారితో కలెక్టర్ చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ దాదాపు 5 వేల మందికిపైగా యోగా సాధకులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగు నీరు, వైద్య సేవలు వంటి తగిన ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. మున్సిపల్, పోలీసు, రెవెన్యూ, ఆయుష్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యామ్నాయంగా డా. బీఆర్ అంబేద్కర్ కళా వేదికలోనూ యోగా నిర్వహించేలా ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం అక్కడ కూడా అవసరమైన అన్ని సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేస్తున్నామన్నారు. శాఖల సమన్వయంతో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు విజయవంతం చేసేందుకు యోగాలో పాల్గొనే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

## టెలిగ్రామ్ యాప్‌ను బ్లాక్ చేసిన కేంద్రం

ఉపయోగిస్తున్నట్లు ఎన్టీఏ గుర్తించింది. తమకు ప్రశ్నపత్రం యాక్సెస్ ఉందని మోసపూరిత ప్రచారం చేస్తోన్న అనేక ఛానళ్లు, గ్రూప్‌లు, బాట్‌లను అధికారులు ఇప్పటికే తొలగించారు. అయితే ఈ చర్యలు సరిపోవని భావించడంతో, ఆంక్షల అవసరం ఏర్పడిందని ఎన్టీఏ వెల్లడించింది. ఈ ఆంక్షల వల్ల చట్టబద్ధమైన యూజర్లకు అసౌకర్యం ఏర్పడనుంది. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ.. దేశంలో అత్యంత కీలమైన ప్రవేశ పరీక్షల్లో ఒకటైన నీట్ సమగ్రతను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొంది. గతనెల 3న జరిగిన నీట్ ప్రశ్న పత్రాలు లీకైన నేపథ్యంలో దాన్ని రద్దు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. 'నీట్ - యూజీ'ని ఈనెల 21న తిరిగి నిర్వహించనున్న నేపథ్యంలో, ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లుచేసినట్లు కేంద్ర ఆరోగ్య, విద్యాశాఖల ఉన్నతాధికారులు ఇటీవల పార్లమెంటరీ సంఘానికి వెల్లడించారు. అలాగే రీ-ఎగ్జామ్ ప్రశ్నపత్రాల తయారీలో పాల్గొన్న నిపుణులను రహస్య ప్రదేశంలో లాక్‌డౌన్‌లో ఉంచినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. అయినా సరే.. రీటెస్ట్ పేపర్ కూడా లీక్ అయిందంటూ వచ్చిన వదంతులు ప్రచారం అయ్యాయి. వాటిని ఇప్పటికే ఎన్టీఏ ఖండించింది. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ దుష్ప్రచారం అవాస్తవం, మోసపూరితమని పేర్కొంది. తప్పుడు ప్రచారం వ్యాప్తి చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటికే హెచ్చరించింది.

# ఎడిటర్ వాయిస్

## రేపల్లె మంత్రిగారి మీద వైసీపీ స్కెచ్!

ఉమ్మడి గుంటూరు జిల్లా రేపల్లె రాజకీయంగా కీలకమైన అసెంబ్లీ నియోజకవర్గం. అసలే రాజకీయ చైతన్యం అధికంగా ఉన్న జిల్లా గుంటూరు. అలాంటి చోట రేపల్లె ఉంది. ఇక్కడ హ్యాట్రిక్ పరాజయం అందుకుంది వైసీపీ దాంతో కసిగా పనిచేసి అయినా 2029 ఎన్నికల్లో గెలిచి తీరాలని అనుకుంటోంది. రేపల్లెలో టీడీపీ మంచి పట్టు సాధించింది. గతంలో అయితే ఒక ఎన్నికలో టీడీపీ గెలిస్తే మరో ఎన్నికలో కాంగ్రెస్ గెలిచేది. కానీ వరసగా మూడు ఎన్నికల నుంచి అనగాని సత్యప్రసాద్ గెలిచి వస్తున్నారు. ఏపీలోని కూటమి మంత్రివర్గంలో ఆయన రెవిన్యూ శాఖ మంత్రిగా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనగానికి రేపల్లెలో తిరుగులేదని కూడా చెబుతూంటారు. అయితే మూడు పర్యాయాలు గెలిచి మంత్రిగా ఉన్న ఆయనని ఓడించేందుకు వైసీపీ భారీ స్కెచ్ గీస్తోంది అని అంటున్నారు.

వైసీపీ ఓటమి వెనక : కాంగ్రెస్ లో ఒకసారి మాత్రమే రేపల్లె నుంచి మోపిదేవి వెంకటరమణ గెలిచారు. ఆయనకు వైఎస్సార్ మంత్రివర్గంలో స్థానం లభించింది. ఇక 2014లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి పాలు అయ్యారు. 2019లో కూడా మోపిదేవి ఓడినా ఎమ్మెల్సీ చేసి మంత్రి పదవిని కట్టబెట్టారు జగన్. అయితే శాసనమండలిని రద్దు చేయాలన్న కారణంతో ఆయనకు రాజ్యసభ ఇచ్చారు. 2024లో మోపిదేవిని పక్కన పెట్టి ఈవూరి గణేష్ కి టికెట్ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో వైసీపీ ఓడింది. ఇక మోపిదేవి టీడీపీలో చేరిపోయారు.

ఆ రెండే కీలకం : ఇక రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు సామాజిక వర్గాలు కీలకం అని అంటున్నారు. అందులో ఒకటి గౌడ, రెండవది కాపు. ఈ రెండు వర్గాల బలంతోనే ఎవరైనా గెలవాల్సి ఉంటుంది. ఇక్కడ గౌడ కులస్తులు 45 వేల వరకూ ఉంటే కాపులు 42 వరకూ ఉన్నారు. వైసీపీ ఇంతకాలం మత్స్యకారులకు టికెట్లు ఇస్తూ వచ్చింది. ఇపుడు రూట్ మార్చింది గౌడలను అక్కున చేర్చుకుంటూనే కాపులను చేరదీసింది. తాజాగా మోపిదేవి శ్రీనివాసరావుని వైసీపీ తమ పార్టీలోకి చేర్చుకుంది. ఆయనకు జగన్ స్వయంగా నేను అన్నీ చూసుకుంటాను అని మాట ఇచ్చారు. దాంతో వచ్చే ఎన్నికల్లో మోపిదేవి శ్రీనివాస్ కి టికెట్ దక్కుతుందంకి ప్రచారం ఊపందుకుంది. ప్రస్తుతం ఇంఛార్జిగా ఉన్న గౌడ సామాజిక వర్గానికి చెందిన పీట నాగ మోహన క్రిష్ణ తో కాకుండా విడిగా మోపిదేవి జనంలోకి వెళ్తున్నారు. దాంతో రెండు వర్గాలుగా రేపల్లె వైసీపీ చీలిపోయింది అని అంటున్నారు.

వికటిస్తున్న ప్రయోగం : వైసీపీ ఎపుడు ప్రయోగం చేసినా అది వికటిస్తోంది అని రేపల్లెలో పార్టీ నేతలు అంటున్నారు. నిజానికి పీటా నాగ మోహన్ క్రిష్ణ వచ్చాక వైసీపీ పుంజుకుంది. ఆయన అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇపుడు మోపిదేవి వచ్చాక పార్టీలో ఇద్దరు నేతలు కలుస్తారని అంతా భావించారు. కానీ రాజకీయంగా తానే సీనియర్ అని మోపిదేవి భావిస్తున్నారు అని అంటున్నారు. దాంతో ఆయన సెపరేట్ గా జనంలో తిరుగుతున్నారు. ఆయన వర్గీయులు అయితే తమ నేతకే టికెట్ అని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ



పరిణామాలతో పీటా వర్గం డీలా పడుతోంది. మొత్తానికి ఇద్దరు బలమైన నేతలను కలిపిస్తే ఈసారి మంత్రిని ఓడించవచ్చు అని స్కెచ్ గీసిన వైసీపీకి ఈ ఇద్దరు నేతల మధ్య గ్యాప్ కలవరం రేకెత్తిస్తోంది అని అంటున్నారు. మరి ఈ పరిస్థితిని ఎలా చక్కదిద్దుతారో చూడాల్సి ఉంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## భార్యతో విభేదాలు.. అత్తగారింటికి వెళ్లిన వ్యక్తి దారుణ హత్య!



**మహబూబాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామంలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామానికి చెందిన కుండె నరేశ్ (35) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందినట్లు సమాచారం. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ విభేదాల నేపథ్యంలో నరేశ్ తన భార్య అత్తగారింటికి వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో నరేశ్‌పై రాడ్‌తో తలపై తీవ్రంగా దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఘటన అనంతరం నరేశ్ భార్యతో పాటు అత్తమామలు కనిపించకపోవడంతో గ్రామస్థులు వారిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. మృతుడు నరేశ్‌కు ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనతో ఉప్పరపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భార్యను వదిలేసిన భర్త..

### మరో మహిళతో సహజీవనం..


### ఇద్దరు మగ పిల్లలకు తండ్రి.. న్యాయం చేయాలంటూ బాధితురాలి ఆవేదన



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భార్యను, కుమార్తెను వదిలేసిన భర్త అనంతరం మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడంటూ ఓ మహిళ చేసిన ఆరోపణలు సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనంగా మారాయి. తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని బాధిత మహిళ అధికారులను ఆశ్రయించింది. వనపర్తి జిల్లాకు చెందిన అర్చనకు 2012లో అదే జిల్లాకు చెందిన రవితో వివాహం జరిగింది. వివాహానంతరం ఉమ్మడి కుటుంబం పేరుతో ఇంటి పనులు, వ్యవసాయ పనులు చేయించడంతో పాటు అత్తింటి వేధింపులు ఎదుర్కొన్నానని అర్చన ఆరోపించింది. ఆడపిల్ల పుట్టిన తర్వాత భర్త, అత్తింటి వారి వైఖరిలో మార్పు వచ్చిందని, తనను నిర్లక్ష్యం చేయడం ప్రారంభించారని తెలిపింది. తనకు దూరంగా ఉంటూ హైదరాబాద్‌కు మకాం మార్చిన రవి, మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడని ఆరోపించింది. తనకు ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భర్త రవి వనపర్తి కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశాడని, అయితే ఆ పిటిషన్‌ను న్యాయస్థానంలో వాదనలు కొనసాగుతున్నాయని, సెటిల్మెంట్ కోసం ఈనెల 28న ఫైనల్ హియరింగ్ ఉండగా న్యాయస్థానం కు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు బాధితురాలు పేర్కొంది. ఇటీవల కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో భర్త నివాసం వద్దకు వెళ్లిన అర్చన, అతడు మరో మహిళతో కలిసి జీవిస్తున్న విషయాన్ని గుర్తించినట్లు తెలిపింది. దీంతో తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని, భరణం ఇప్పించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. ఈ ఘటనపై మహిళా సంఘాలు, పోలీసు అధికారులు స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని బాధిత కుటుంబం కోరుతోంది. సరూర్నగర్ పోలీసులు పూర్వా పరాలు పరిశీలిస్తున్నారు.

## గంజాయి తరలిస్తున్న కారు ప్రమాదానికి గురి

### కారులో ఐదుగురు యువకులు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** నగర శివారు పశ్చిమ బైపాస్ కండ్రిక సమీపంలో గంజాయిని తీసుకెళ్తున్న కారు ప్రమాదానికి గురి..!! అతివేగంగా వెళుతూ అదుపుతప్పి ఎదురుగా వెళుతున్న లారీని ఢీకొట్టగా...కారు నడుపుతున్న సూర్య అనే యువకుడికి తీవ్రగాయాలు..

## పుట్టిన రోజునాడే యువకుడి మృతి





**మంచిర్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** జన్నారం మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన రాకేశ్ (22) హైదరాబాద్లో బైక్పై వెళ్తూ రోడ్డు డివైడర్కు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. చింతగూడ గ్రామానికి చెందిన మల్లేశ్- సుజాత దంపతుల పెద్ద కుమారుడైన రాజేశ్ హైదరాబాద్లో హోటల్ మేనేజ్మెంట్ చేస్తున్నాడు. మంగళవారం రాకేశ్ పుట్టినరోజు కావడంతో సోమవారం రాత్రి 12 గంటలకు స్నేహితులతో కలిసి కేక్ కట్ చేసేందుకు వెళ్తుండగా యాక్సిడెంట్ జరిగి మృతి చెందాడు.

### ఇన్నోవా వాహనంతో పాటుగా

## 8 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

### సిద్దవటం రేంజర్ కళావతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** సిద్ధవటం బీటులో ఇన్నోవా వాహనంతో పాటుగా 8 ఎర్రచందనం దుంగలు స్వాదీనం చేసుకున్నట్లు రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలోఆమె మాట్లాడుతూ కడప డిఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాలతో సిద్దవటం బీటు నల్లబండల రస్తా ప్రదేశంలో తెల్లవారుఝామున ఎర్రచందనం దుంగలు తరలించేందుకు లోడు చేస్తున్నారనే సమాచారం తెలిసిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడులలో నిందితులు పరారవగా ఇన్నోవా, వాహనంతో పాటుగా 8 ఎర్రచందనం దుంగలు స్వాదీనం చేసుకున్నామన్నారు. పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ మక్తర్ బాషా, సెక్షన్ ఆఫీసర్ సురేష్ బాషా, ఎఫ్బీఓ ఆది విశ్వనాథ్, ఏబీఓ హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

## దళిత వెటర్నరీ డాక్టర్‌పై దాడి

**మొగులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కంచికచర్ల మండలం మొగులూరు గ్రామంలో వెటర్నరీ వైద్యుడుగా విజయ్ విశ్వనాథ్ విధులు నిర్వహిస్తున్నారు. నిన్న అనగా సోమవారం ఒంటిగంట సమయంలో పశువులున్న రైతులకు పశు దానా పంపిణీ సమయంలో వెటర్నరీ వైద్యుని పై ఎటువంటి పశువులు లేని వెలగా నాగరాజు, వెలగా విష్ణు లు భౌతికంగా దాడి చేశారు. ఈ దాడి జరిగిన వెంటనే వెటర్నరీ వైద్యులు విజయ విశ్వనాథ్ కంచికచర్ల పోలీస్ స్టేషన్లో నిన్న సాయంత్రం ఫిర్యాదు చేసినప్పటికీ ఇంతవరకు కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫిర్యాదు చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే అధికార పార్టీ నాయకులు రాజీ ప్రయత్నం చేశారు. అధికార పార్టీకి చెందిన ఒక కీలక నేత కంచికచర్ల పోలీసులకు ఈ ఫిర్యాదు పై ఎటువంటి చర్యలు తీసుకొనే అవసరం లేదని నేను మాట్లాడుతానని హుకుం జారీ చేశారు. విధి నిర్వహణలో ఉన్న దళిత వెటర్నరీ వైద్యుడు నేను ఏమీ మాట్లాడకుండానే నాపై కుల దోషను దూషిస్తూ ఒక రూమ్ లో బంధించి పిడి గుద్దులు తో దాడి చేశారని బాధితుడు వాపోతున్నాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేస్తారో లేదో వేచి చూడాలి.

### 5 ఓపెన్ ప్లాట్లు, అపార్ట్‌మెంట్..


## నరహరి అక్రమాస్తులు రూ.150 కోట్లకు పైనే



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరిని ఏసీబీ అరెస్ట్ చేసింది. నరహరి ఇంటితో పాటు మరో 9 చోట్ల తనిఖీలు నిర్వహించినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమాస్తులను గుర్తించినట్లు తెలిపారు. నరహరి ఇంట్లో రూ.1.54కోట్ల నగదు, రూ.5.04 కోట్ల విలువ చేసే ఫిక్స్డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలో రూ.2.29 కోట్లు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. 1.3 కిలోల బంగారం, 8 కిలోల వెండి ఆభరణాలు, భార్య పేరున రెండు బ్యాంకు లాకర్లు, కారు ఉన్నట్లు అధికారులు తేల్చారు. రంగారెడ్డి జిల్లాల్లో 5 ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరంలో 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో ఓ అపార్ట్‌మెంట్ ఉన్నట్లు గుర్తించారు. నార్సింగిలోని అపార్ట్‌మెంట్‌లో రెండు ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్, గచ్చిబౌలి టీఎన్జీవో కాలనీలో జీప్లస్ 3 భవనం, ఛత్రినాకలో మూడంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ ఆస్తుల విలువ రూ.13.05 కోట్లు అని.. బహిరంగ మార్కెట్‌లో రూ.150 కోట్లకు పైనే ఉంటుందని అధికారులు వెల్లడించారు.

### భర్తతో టూర్‌కు వెళ్లి.. ఉత్తరాఖండ్‌లో

## విశాఖ టెకీ అనుమానాస్పద మృతి



**పెందుర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరాఖండ్‌లో విశాఖపట్నానికి చెందిన టెకీ గాయత్రి మృతిచెందింది. భర్తతో కలిసి టూర్‌కు వెళ్లిన ఆమె.. ముస్సోరిలోని ఓ హోటల్ రూమ్‌లో మరణించినట్లు పోలీసులు గుర్తించారు. ముక్కు నుంచి రక్తం రావడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖలోని చినముషిడివాడకు చెందిన గాయత్రికి శ్రీచరణ్‌తో గతేడాది నవంబర్ 8న వివాహం జరిగింది. ఇద్దరూ గురుగ్రామ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. గాయత్రి మృతి ఆమె కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలిసి కుటుంబ సభ్యులు ముస్సోరికి బయల్దేరి వెళ్లారు.


## రోజూ ఒక నారింజ తింటే ఇన్ని లాభాలా,,? ఏయే రోగాలను నయం చేస్తుందో తెలిస్తే అవాక్కే,,!




రోజుకో యాపిల్ తింటే డాక్టర్‌తో పని ఉండదనే మాటలు మనం తరచూగా వింటూనే ఉంటాం. అలాగే రోజుకో నారింజ తింటే డిప్రెషన్‌కు దూరంగా ఉండొచ్చునని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ మేరకు బయోమెడ్ సెంట్రల్‌లో ప్రచురించిన అధ్యయనం వివరాలు వెల్లడిస్తున్నాయి. ఆరెంజ్ తినడం వల్ల డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదం 20 శాతం వరకు తగ్గుతుందని అధ్యయనం వెల్లడించింది. నారింజ పండ్లు మన పొట్టలో ఒక రకమైన బ్యాక్టీరియా పెరిగేలా చేస్తాయి. ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది. రోజుకో ఆరెంజ్ తినటం వల్ల కలిగే బెనిఫిట్స్ ఏంటో ఇక్కడ చూద్దాం... నారింజ తినడం ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. దీనిని రోజూ తీసుకోవడం వలన అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇతర అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఆరెంజ్‌లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణ సమస్యలను దూరం చేస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. ఆరెంజ్‌లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. ఆరెంజ్ చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. ముఖంపై ముడతలు, నల్ల మచ్చలను తొలగించడంలో సహాయపడుతుంది. ఆరెంజ్ లోని పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. యాంటీఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. ఆరెంజ్‌లో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం సమస్యను దూరం చేస్తుంది. ఆరెంజ్‌లో ఉండే సిట్రేట్, కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరెంజ్‌లో ఫైబర్ ఎక్కువ, కేలరీలు తక్కువ. అందుకే ఇవి తిన్నప్పుడు కడుపు నిండిన భావన కలుగుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. ఆరెంజ్‌లోని కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ డి ఎముకలను స్ట్రాంగ్ చేస్తాయి. కీళ్లనొప్పులను దూరం చేస్తాయి. రోజుకో పండు తినటం వల్ల చర్మం కాంతివంతంగా మారుతంది. అంతేకాకుండా వృద్ధాప్యఛాయలు దూరమవుతాయి. ఆరెంజ్?లలోని ఫ్లేవనాయిడ్స్ బీపీని, కొలెస్ట్రాల్?ని కంట్రోల్ చేసి గుండె సమస్యలను దూరం చేస్తాయి. ఆరెంజ్‌లలోని విటమిన్ సి రోగనిరోధక శక్తినిపెంచి.. హెల్తీగా ఉండడంలో హెల్ప్ చేస్తుంది. కేలరీలు తక్కువగా ఉండి ఫైబర్ పుష్కలంగా ఉండే వీటిని తింటే బరువు కూడా కంట్రోల్ అవుతుంది. దీనిలో యాంటీ ఆక్సిడెంట్లు పలు రకాల క్యాన్సర్లను దూరం చేయడంలో హెల్ప్ చేస్తాయి. ఇవి కేవలం అవగాహన కోసమే. నిపుణుల సహాయం తీసుకుంటే మంచిది. ఈ మేరకు బయోమెడ్ సెంట్రల్‌లో ప్రచురించిన అధ్యయనం వివరాలు వెల్లడిస్తున్నాయి. ఆరెంజ్ తినడం వల్ల డిప్రెషన్‌కు గురయ్యే ప్రమాదం 20 శాతం వరకు తగ్గుతుందని అధ్యయనం వెల్లడించింది. నారింజ పండ్లు మన పొట్టలో ఒక రకమైన బ్యాక్టీరియా పెరిగేలా చేస్తాయి. ఇది ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

బుధవారం, 17 జూన్, 2026




www.viswam voice.com

# బాల్య విద్య బలోపేతానికి ప్రభుత్వం - ఐటీసీ సంయుక్త కృషి

## అంగన్‌వాడీ కేంద్రాల బలోపేత కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలే బలమైన వేదిక అని బాల్య విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం మరియు ఐటీసీ సంస్థలు సంయుక్తంగా విశేష కృషి చేస్తున్నాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. రామచంద్రపురం మున్సిపల్ ఓపెన్ ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ మహిళా, శిశు సంక్షేమ శాఖ, ఐటీసీ మిషన్ సునెహ్రా కల్, ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అంగన్‌వాడీ కేంద్రాల బలోపేత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మంచి విద్యతోనే ఉన్నతమైన జీవితం సాధ్యమవుతుందని విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి విద్యను మరింత బలోపేతం చేయడానికి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రీ స్కూల్ చిన్నారులకు నాణ్యమైన ప్రాథమిక బాల్య సంరక్షణ, విద్య అందించడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని చిన్నారులకు ఆనందదాయకమైన బాలల కేంద్రిత అభ్యాస వాతావరణాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కల్పించేందుకు ఐటీసీ చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని కొనియాడారు. ప్రీ-స్కూల్ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని చెప్తూ రామచంద్రపురం నియోజకవర్గంలోని 105 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం చాలా ఆనందదాయకమని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ (హెచ్ఆర్) వీరస్వామి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణలు అందించి వారి సామర్థ్యాలను పెంపొందిస్తున్నామని ప్లే కిట్లు మరియు ప్రీ-స్కూల్ బోధనా-అభ్యాస సామగ్రిని అందించడం ద్వారా నాణ్యమైన విద్యను ప్రోత్సహిస్తున్నామని వివరించారు. చిన్నారుల సమగ్రాభివృద్ధికి బాలల కేంద్రిత బోధనా విధానాలను బలోపేతం చేయడంతో పాటు తల్లిదండ్రులు మరియు సమాజ భాగస్వామ్యాన్ని పెంచి పిల్లల అభ్యాస ప్రక్రియలో కుటుంబాల పాత్రను మరింత బలోపేతం చేస్తున్నామని ప్రతి చిన్నారి ఆత్మవిశ్వాసంతో ప్రాథమిక పాఠశాలలో అడుగుపెట్టేలా పాఠశాల సిద్ధతను మెరుగుపరచడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ (ప్రాసెసింగ్ & టెక్నాలజీ & సప్లై చైన్) కే ఎన్ రావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో అత్యుత్తమ నాణ్యమైన అభ్యాస వాతావరణం ఏర్పడి, చిన్నారుల సమగ్ర అభివృద్ధి తల్లిదండ్రుల భాగస్వామ్యం, సమాజ సహకారం మరింత బలోపేతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఐటీసీ లిమిటెడ్ ప్రతినిధి ఎస్.ఆర్. గణపతి సుబ్రమణియన్ మాట్లాడుతూ మిషన్ సునెహ్రా కల్ ద్వారా విద్యా, బాలల సంక్షేమ కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు. ఈ ఘనమైన విద్యా సదస్సులో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి, ఫ్యాక్టరీస్ మేనేజర్ గణపతి సుబ్రహ్మణ్యం, కూటమి పార్టీల సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఐటీసీ ఎంఎస్‌కే ప్రతినిధి దెబాస్మితి, ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ పర్సనల్ మేనేజర్ ఎమ్.వినయ్ బాబు, ప్రాజెక్ట్ మేనేజర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు ఐటీసీ ప్రత్యేక కిట్లను మంత్రి సుభాష్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ విద్యా ప్రదర్శన స్టాల్స్ లను మంత్రి సుభాష్ ఆసక్తిగా పరిశీలించి చిన్నారుల విద్యా వికాసానికి కృషి చేస్తున్న నిర్వాహకులను మరియు ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

#### యోగాంధ్ర జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో

# సుందరపల్లి విద్యార్థిని జి.క్రాంతి ప్రతిభ



### రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

**పామర్రు, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని గోదావరి భవన్‌లో నిర్వహించిన యోగాంధ్ర-2026 జిల్లా స్థాయి పోటీలలో కే.గంగవరం మండలం సుందరపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి.క్రాంతి అద్భుత ప్రతిభ కనబరిచింది. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఈ పోటీల్లోని వ్యాసరచన విభాగంలో ఆమె ఘన విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన అమరావతిలో ప్రతిష్టాత్మకంగా జరగబోయే యోగాంధ్ర రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలలో జి.క్రాంతి పాల్గొననుంది. జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థిని క్రాంతిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ గారు, ఉపాధ్యాయులు పి.వి. బ్రహ్మానందం, వ్యాయామ ఉపాధ్యాయులు నాగుబాబు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే స్థానిక ఎంపిటిసి జానకి రామయ్య, మండల విద్యాశాఖ అధికారులు ఏ. నాగరాజు, సిహెచ్. ఆంజనేయులు, డిఎస్ఓ సుబ్రహ్మణ్యం, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్, సభ్యులు మరియు సుందరపల్లి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినికి తమ అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. అమరావతిలో జరిగే తుది పోటీల్లో కూడా క్రాంతి ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, మండలానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

#### "ల్యాబ్ ఆన్ వీల్స్" కార్యక్రమానికి

# మంత్రి వాసంశెట్టి సుభాష్ శ్రీకారం

### విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకతకు దోహదం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాల పెంపుదలకు దోహదపడే "ల్యాబ్ ఆన్ వీల్స్" కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం స్థానిక ఎస్ ఎల్ బి మున్సిపల్ హైస్కూల్లో ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఇన్ఫోసిస్ స్ప్రింగ్‌బోర్డ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వినూత్న కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాల్లో ప్రత్యక్ష అనుభవంతో కూడిన శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. "ల్యాబ్ ఆన్ వీల్స్" ద్వారా సైన్స్ ప్రయోగాలు, ఇంటరాక్టివ్ మోడల్స్, టెక్నాలజీ ఆధారిత ప్రదర్శనలతో విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు పెంపొందుతాయని తెలిపారు. ఈ మొబైల్ లెర్నింగ్ వాహనంలో ఎలక్ట్రానిక్స్, మైక్రోకంట్రోలర్ ఆధారిత ప్రాజెక్టులు, రోబోటిక్స్ ప్రాజెక్టులు వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో విజయవంతంగా అమలైన ఈ కార్యక్రమం ద్వారా 20 వేల మందికి పైగా విద్యార్థులు, యువత లబ్ధి పొందారని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కొనసీమ జిల్లాలో జూన్ 16 నుండి ఆగస్టు 16 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, స్కిల్ హబ్‌ల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణాత్మక భావాలను పెంపొందించే దిశగా ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వాసంశెట్టి శ్రీ సత్య, ఏపిఎస్ఎస్ డిసి కో-ఆర్డినేటర్ ఆర్ రఘువర్మ, మండల విద్యాశాఖ అధికారులు,ఎమ్ శ్రీనివాసరావు, వి నాగేశ్వరి, హెచ్ఎం సిహెచ్ పూర్ణ ప్రియ, ఐఇ కోఆర్డినేటర్స్ సత్యనారాయణ, విఠల్,ఇన్ఫోసిస్ ప్రతినిధులు, చందమామ వాసు, హైస్కూలు టీచింగ్ బృందం, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జన్మదినం కాదు... ప్రజా సేవా దినోత్సవం

## మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజున 'ఎస్ఏఎఫ్' ఆధ్వర్యంలో ఒకేరోజు 100 సేవా కార్యక్రమాలు

**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజా సేవను జీవిత ధ్యేయంగా భావించి, నిత్యం ప్రజల మధ్య ఉంటూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించే రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదినోత్సవాన్ని ఈసారి అత్యంత వినూత్నంగా నిర్వహించాలని శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ ఏ ఎఫ్) నాయకులు నిర్ణయించారు. రామచంద్రపురంలో మంత్రి సుభాష్‌కు పూలమాలలు, పూల గుత్తులు అందించడం పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు కట్టడం కంటే సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడమే ఆయనకు ఇచ్చే నిజమైన జన్మదిన కానుకగా భావిస్తున్నారు. ఇందులో భాగంగానే "100 Acts of Service in One Day" అనే ప్రత్యేక కాన్సెప్ట్‌తో ఒకే రోజు 100 సేవా కార్యక్రమాలను చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పూల గుత్తులు కాదు - పుస్తకాలు అందిద్దాం, పూలమాలలు కాదు - మొక్కలు నాటుదాం, ఫ్లెక్సీలు కాదు - సేవా కార్యక్రమాలు చేద్దాం, వేడుకలు కాదు - పేదల ముఖాల్లో చిరునవ్వులు నింపుదాం అనే ఉన్నతమైన సందేశంతో ఈ కార్యక్రమాలను డిజైన్ చేశారు. కేవలం పెద్ద పనులే కావాల్సిన అవసరం లేదని ఒక పుస్తకాన్ని బహుమతిగా ఇవ్వడం, ఒక మొక్కను నాటడం ఆకలితో ఉన్నవారికి భోజనం అందించడం వంటి చిన్న చిన్న మంచి పనులు కూడా సమాజంలో గొప్ప మార్పుకు నాంది పలుకుతాయని శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మహత్తర సేవా యజ్ఞంలో భాగంగా ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాలు, రక్తదాన శిబిరాలు, నేత్ర పరీక్షా శిబిరాలు, పేద రోగులకు ఉచిత మందుల పంపిణీ, గర్భిణీ స్త్రీలకు పోషకాహార కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ, వృద్ధులకు నడక కర్రలు, దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీతో పాటు పాఠశాలల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ల ఏర్పాటు వంటి అనేక రకాల విలక్షణ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ జన్మదినాన్ని కేవలం హంగూ ఆర్భాటాల వేడుకగా కాకుండా సమాజానికి ఉపయోగపడే ఒక "ప్రజా సేవా దినోత్సవంగా" మార్చాలనే సత్సంకల్పంతో ఈ పనులు చేపడుతున్నామని కాబట్టి ప్రతి ఒక్కరూ తమ పరిధిలో కనీసం ఒక మంచి పని చేసి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎస్ఏఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు.





# అమర్నాథ్ గౌడ్ త్యాగాన్ని సమాజం ఎప్పటికీ మరవదు

### అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా నిలిచింది టీడీపీయే : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

### సోదరి గౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమర్నాథ్ గౌడ్‌కు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ : కుడుపూడి సత్తిబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారి పాలెంకు చెందిన అమర్నాథ్ గౌడ్ దారుణ హత్య జరిగి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక అబ్దుల్ ఫంక్షన్ హాల్‌లో రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్ పాలనలో బీసీలపై అనేక రూపాల్లో కక్షసాధింపు జరిగిందన్నారు. తన సోదరిని వేధిస్తున్న విషయమై ప్రశ్నించినందుకే అమర్నాథ్ గౌడ్ అనే అమాయక విద్యార్థిని సజీవ దహనం చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. ప్రధాన నిందితుడు అప్పటి అధికార వైసీపీ పార్టీకి చెందిన వ్యక్తి కావడం వల్లే అధికార మదంతో రెచ్చిపోయారన్నారు. ఘటన జరిగిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు, అమర్నాథ్ సోదరి హేమశ్రీ విద్యాభ్యాస బాధ్యతలను నారా భువనేశ్వరి స్వీకరించడం మానవత్వానికి నిదర్శనమన్నారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆమెకు ఉచిత విద్య అందించడంతో పాటు రూ.10 లక్షల ఆర్థిక సాయం, ఇంటి నిర్మాణానికి అవసరమైన సహాయాన్ని కూడా అందించారని తెలిపారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో శాంతి భద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేసు విచారణను మరింత వేగవంతం చేసి, బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రత్యేక న్యాయ సలహాదారులను కూడా నియమించిందని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సోదరి గౌరవం కోసం నిలబడి ప్రాణత్యాగం చేసిన అమర్నాథ్ గౌడ్ త్యాగాన్ని సమాజం ఎప్పటికీ మరవదని, బాధిత కుటుంబానికి తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని కుడుపూడి సత్తిబాబు స్పష్టం చేశారు. అమర్నాథ్ గౌడ్‌కు ఘన నివాళులర్పిస్తూ సాయంత్రం 6 గంటలకు స్థానిక ఆర్ట్స్ కాలేజీ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నుండి లాలాచెరువులోని గౌతు లచ్చన్న విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్నామని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి సంఘీభావం తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు.



# అమలాపురం పాత్రికేయ రంగానికి తీరని లోటు

## ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్టు కొండేపూడి సత్యనారాయణ కన్నుమూత



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పాత్రికేయ రంగంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న సీనియర్ పాత్రికేయులు, అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొండేపూడి సత్యనారాయణ మృతి చెందడం జర్నలిస్టు లోకాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. నాలుగు దశాబ్దాలకు చేరువైన తన పాత్రికేయ ప్రస్థానంలో వార్తను కేవలం వృత్తిగా కాకుండా ప్రజాసేవగా భావించిన ఆయన మరణం కోనసీమ ప్రాంతానికి తీరని లోటుగా మారింది. పాత్రికేయ రంగంలో నిబద్ధత, నిజాయితీ, వాస్తవాల పట్ల అంకితభావం అంటే ముందుగా గుర్తుకు వచ్చే పేరు కొండేపూడి సత్యనారాయణదే. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం, సామాన్యుల గొంతుకగా నిలవడం, అభివృద్ధి అంశాలపై నిరంతరం కలం పట్టడం ద్వారా ఆయన జర్నలిజానికి ప్రత్యేక గౌరవాన్ని తీసుకువచ్చారు.

**ఆంధ్రభూమితో మూడు దశాబ్దాల అనుబంధం**

సత్యనారాయణ పాత్రికేయ జీవితంలో అత్యంత ముఖ్యమైన అధ్యాయం ఆంధ్రభూమి పత్రికతో ముడిపడి ఉంది. దాదాపు 30 సంవత్సరాలకు పైగా అమలాపురం కేంద్రంగా ఆంధ్రభూమి విలేఖరిగా పనిచేసిన ఆయన, జిల్లాలో జరిగిన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, విద్యా, వ్యవసాయ రంగాలకు సంబంధించిన వేలాది వార్తలను ప్రజలకు చేరవేశారు. ఆంధ్రభూమి పత్రికకు పనిచేసిన కాలంలో ఆయన వార్తల నాణ్యత, ఖచ్చితత్వం, విశ్వసనీయతకు ప్రతీకగా నిలిచారు. ఏ వార్త అయినా పూర్తిస్థాయిలో పరిశీలించి, అన్ని కోణాల్లో సమాచారం సేకరించి ప్రజల ముందుకు తీసుకురావడం ఆయన ప్రత్యేకత. అందుకే అధికారుల నుండి సామాన్య ప్రజల వరకు అందరి గౌరవాన్ని సంపాదించుకున్నారు.

**విశాలాంధ్రలోనూ విశిష్ట సేవలు**

ఆంధ్రభూమిలో సుదీర్ఘ సేవల అనంతరం ప్రస్తుతం విశాలాంధ్ర జిల్లా రిపోర్టర్గా కొనసాగుతున్న సత్యనారాయణ, వయసు పెరిగినా తన వృత్తిపట్ల ఉన్న అంకితభావాన్ని ఏమాత్రం తగ్గించుకోలేదు. ప్రతి రోజు వార్తల కోసం ప్రజల మధ్య తిరుగుతూ, సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో ఆయన చురుకుగా వ్యవహరించేవారు. జిల్లా స్థాయిలో జరుగుతున్న పరిణామాలను విశ్లేషణాత్మకంగా ప్రజలకు అందించడంలో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. యువ జర్నలిస్టులకు మార్గదర్శకుడిగా, సీనియర్గా ఎప్పుడూ ప్రోత్సాహం అందించేవారు.

**అమలాపురం ప్రెస్ క్లబ్కు బలమైన నాయకత్వం**

అమలాపురం ప్రెస్ క్లబ్ అధ్యక్షులుగా ఆయన నిర్వహించిన సేవలు చిరస్మరణీయమైనవి. పాత్రికేయుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వృత్తి అభివృద్ధి కోసం ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. జర్నలిస్టుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారు. ప్రెస్ క్లబ్ను కేవలం ఒక సంస్థగా కాకుండా జర్నలిస్టుల కుటుంబంగా భావించి అందరినీ కలుపుకుపోవడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. యువ విలేఖరులకు శిక్షణ, ప్రోత్సాహం అందిస్తూ వారికి వృత్తి నైపుణ్యాలను నేర్పించేవారు.

**ప్రజల మనిషిగా గుర్తింపు**

కొండేపూడి సత్యనారాయణ కేవలం జర్నలిస్టే కాదు, ప్రజల మనిషిగా కూడా ప్రత్యేక గుర్తింపు పొందారు. కోనసీమ ప్రాంత అభివృద్ధికి సంబంధించిన అంశాలను నిరంతరం ప్రస్తావిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశారు. వరదలు, తుఫాన్లు, రైతు సమస్యలు, మౌలిక సదుపాయాల కొరత వంటి ఎన్నో అంశాలపై ఆయన రాసిన కథనాలు అధికార యంత్రాంగాన్ని స్పందించేలా చేశాయి.

**విలువలకు ప్రతిరూపం**

నేటి వేగవంతమైన మీడియా ప్రపంచంలోనూ పాత్రికేయ విలువలను కాపాడిన అరుదైన వ్యక్తుల్లో సత్యనారాయణ ఒకరు. సంచలనాల కోసం కాకుండా వాస్తవాల కోసం పనిచేయాలని ఆయన ఎప్పుడూ చెప్పేవారు. వార్తలలో నిష్పాక్షికత, సమాజం పట్ల బాధ్యత, వృత్తిపట్ల నిబద్ధత వంటి అంశాలను తన జీవితాంతం పాటించారు.

**పాత్రికేయ లోకంలో విషాదం**

ఆయన మరణవార్త తెలిసిన వెంటనే జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాజిక కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోనసీమలోని పలు పాత్రికేయ సంఘాలు ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ, జర్నలిజం రంగానికి ఆయన చేసిన సేవలను కొనియాడాయి. కొండేపూడి సత్యనారాయణ భౌతికంగా దూరమైనప్పటికీ, ఆయన రాసిన వేలాది వార్తలు, పాత్రికేయ విలువల పట్ల చూపిన అంకితభావం, సహచరుల పట్ల చూపిన ఆప్యాయత, ప్రజా సమస్యలపై చేసిన పోరాటం ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతాయి. "వార్తను వృత్తిగా కాకుండా బాధ్యతగా భావించిన జర్నలిస్టు... ప్రజల గొంతుకగా నిలిచిన కలం యోధుడు... కొండేపూడి సత్యనారాయణ." ఆయన మరణం అమలాపురం పాత్రికేయ రంగానికి తీరని లోటు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని పాత్రికేయ లోకం నివాళులర్పిస్తోంది.

# భూమి అర్జీల పరిష్కారంలో పారదర్శకతకు ప్రాధాన్యం

## రీ-సర్వే ప్రక్రియను జనవరి నాటికి పూర్తి చేయాలి : జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భూమి వ్యవహారాలు, రీ-సర్వే, రెవెన్యూ అంశాలపై వచ్చే అర్జీలను పూర్తి పారదర్శకంగా పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, భూ పరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 22-ఏ భూములు, రీ-సర్వే పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, అటవీ భూములు, గృహవసతి, సీజనల్ పరిస్థితులు తదితర అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రెవెన్యూ, సర్వే శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఆధునిక సాంకేతికత వినియోగంతో భూ సరిహద్దులు ఖచ్చితంగా నిర్ధారించేలా అత్యాధునిక రోవర్ పరికరాలను వినియోగించాలని సూచించారు. రానున్న జనవరి నాటికి



జిల్లాలో రీ-సర్వే ప్రక్రియను పూర్తిచేసి రైతులకు సురక్షితమైన కొత్త పాస్ పుస్తకాలను అందించాలని ఆదేశించారు. జిల్లాలో వర్షాధార, కాలువలు, భూగర్భ జలాలు, చెరువుల ఆధారంగా సాగు ప్రాంతాలను వివిధ ప్రమాణాల ప్రకారం విశ్లేషించి ప్రమాద స్థాయిని నిర్ధారించే విధంగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఎల్నినో ప్రభావానికి సంబంధించి వ్యవసాయ రంగంలో ఏర్పడే ప్రమాద పరిస్థితులపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గత పదేళ్లలో కరువు పరిస్థితులు, పొడి కాలాల సంఖ్య, రానున్న వర్షాకాల అంచనాలు, భూగర్భ జలాల స్థాయిలు, చెరువుల నీటి నిల్వ సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రమాద అంచనా రూపొందించినట్లు తెలిపారు. ఎల్నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టి రైతులకు అవసరమైన సూచనలు అందించడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి, జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, రెవెన్యూ డివిజనల్ అధికారులు జి. మమ్మీ, జి.వి.వి. సత్యనారాయణ, ఏ. సరళావతి, ప్రత్యేక ఉప కలెక్టర్ డి. అచ్యుతకుమారి, జిల్లా అటవీ శాఖ అధికారి ఎం.వి. ప్రసాదరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు కె. ప్రభాకర్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు ఎం. రామారావు, గ్రామీణ నీటి సరఫరా శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ.వి.ఎస్. రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత మహిళ హుందాగా కనిపిస్తే ఓర్వలేరా?

## వైఎస్సార్సీపీ నేతలపై ఏపీ బీసీ కార్పొరేషన్ చైర్మన్ ధ్వజం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** హోంమంత్రి అనితపై మాజీ మంత్రి అమరనాథ్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు రెడ్డి అనంత కుమారి మండిపాటు మేకప్ను రాజకీయ విమర్శగా మార్చడం వైఎస్సార్సీపీ వంకర బుద్ధికి నిదర్శనం: అనంత కుమారి ఫైర్ మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే సహించేది లేదు.. కఠిన చర్యలు తప్పవు కూటమి ప్రభుత్వంలో చట్టం ఎవరికీ చుట్టం కాదు. మహిళలను కించపరిస్తే చర్యలు తథ్యం రెడ్డి అనంత కుమారి వార్నింగ్ రాజకీయాల్లో విభేదాలు సహజమని, ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రతి ప్రతిపక్షానికి ఉంటుందని, కానీ విమర్శల పేరుతో మహిళల వ్యక్తిత్వాన్ని, రూపాన్ని, ఆత్మగౌరవాన్ని కించపరచడం ఎంతమాత్రం సరైనది కాదని ఏపీ బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి గారు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఒక దళిత మహిళపై, ఆమె పనితీరును కాకుండా మేకప్ను లక్ష్యంగా చేసుకుని వైఎస్సార్సీపీ మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని ఆమె ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలు కేవలం హోంమంత్రిని మాత్రమే కాకుండా, హుందాగా, ఆత్మవిశ్వాసంతో జీవించే ప్రతి మహిళను అవమానించడమేనని పేర్కొన్నారు. ఒక దళిత మహిళ ఆత్మవిశ్వాసంతో, అందంగా కనిపిస్తే వైఎస్సార్సీపీ నేతలకు ఎందుకు అంత అసహనమని, మీ ఇంట్లోని మహిళలు మేకప్ వేసుకోరా అని ఆమె నిలదీశారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే ఇలా వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, గతంలోనూ వైఎస్సార్సీపీ హయాంలో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్య పోస్టులు పెట్టినా, శాసనసభలో మహిళలను కించపరిచినా నాటి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకుండా మౌనం వహించిందని విమర్శించారు.? అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో చట్టం ఎవరికీ చుట్టం కాదని, తప్పు చేసిన వారు సొంత పార్టీ వారైనా సరే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపేక్షించకుండా చర్యలు తీసుకుంటున్నారని అనంత కుమారి స్పష్టం చేశారు. మహిళలపై వేధింపుల ఆరోపణలు వచ్చిన వెంటనే పక్షపాతం లేకుండా ప్రజాప్రతినిధులపై సైతం చర్యలు తీసుకున్నామని, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వైఎస్సార్సీపీ నేతలను, వారికి సహకరించిన వారిని చట్టపరంగా శిక్షిస్తున్నామని తెలిపారు. మహిళలను గౌరవించని రాజకీయ నేతలకు సమాజంలో మనుగడ ఉండదని, హోంమంత్రి వంగలపూడి అనిత పై చేసిన వ్యాఖ్యలకు గాను మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని రెడ్డి అనంత కుమారి డిమాండ్ చేశారు.

### బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలపై

# ప్రత్యేక దృష్టి

## ఏపీఎస్సీపీసీఆర్ చైర్పర్సన్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఏపీఎస్సీపీసీఆర్) చైర్పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించి అమలాపురంలోని పలు ప్రభుత్వ, సంక్షేమ, ఆరోగ్య సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాలు, శిశు గృహం, వన్ స్టాప్ సెంటర్, ఆనంద నిలయం ఎస్సీ సంక్షేమ వసతి గృహాలలో అందుతున్న సేవలను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. బాలలు, మహిళలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు బాలల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాలో బాలల సంక్షేమం, ఆరోగ్య సేవలు, సంరక్షణ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరిచేందుకు నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్సీపీసీఆర్ సభ్యుడు ఎం.గంగ సూర్యనారాయణ, సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ నాగ మానస, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం. దుర్గారావు దొర తదితర అధికారులు పాల్గొన్నారు.

# అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** వైసిపి పాలనలో బీసీలపై తీవ్ర దాడులు.నాడు జరిగిన అమర్నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం.వైసీపీ పాలనలో బడుగు బలహీనవర్గాలపై జరిగిన అరాచకాలకు అమర్నాథ్ గౌడ్ హత్య ఒక ఉదాహరణ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా వాడపాలెం ఎమ్మెల్యే నివాసం వద్ద అమరనాథ్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పదో తరగతి చదువుతున్న అమర్నాథ్ గౌడ్ కొందరు వైసిపి కి చెందిన యువకులు తన అక్కను వేధిస్తున్న విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పి, వేధించిన వారిని ప్రశ్నించినందుకు, ట్యూషన్కు వెళ్తున్న సమయంలో అతడిపై దాడి చేసి దారుణంగా వైసిపి కార్యకర్తలు హత్య చేశారన్నారు. వైసీపీ హయంలో జరిగిన డాక్టర్ సుధాకర్ ఘటన, డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య, తోట చంద్రయ్య, నందం సుబ్బయ్య వంటి ఘటనలను ప్రస్తావిస్తూ నాటి అరాచక పాలనలో ప్రజలు పడ్డ ఇక్కట్లను గుర్తు చేశారు. వైసీపీ నేతల వేధింపులతో ప్రజలు తీవ్ర బాధలు ఎదుర్కొన్నారని అన్నారు. వైసీపీ హయంలో జరిగిన దారుణాలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరన్నారు.

# చప్పిడి వారి పాలెం పూర్వ విద్యార్థి ఐఐటీకి ఎంపిక సత్కారం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** యస్ఆర్యన్వివిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - చప్పిడి వారిపాలెం నందు 2024 సంవత్సరం పదవ తరగతి పరీక్షలలో 593 మార్కులతో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించిన ఎన్. నవనీత్.విద్యార్థి ఇంటర్మీడియట్ అయిన తర్వాత ఐఐటి -ధన్ బాద్(జార్ఖండ్ ) శిక్షణకు ఎంపిక అయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల - చప్పిడి వారి పాలెం ప్రధానోపాధ్యాయిని కె.అరుణశ్రీ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎన్.నవనీత్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ అధ్యక్షులు పి.బాల వెంకటరమణ, ఎంఈఓ-1 హరిప్రసాద్, ఎంఈఓ-2 లీలావతి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణశ్రీ నవనీత్ను అభినందించారని ప్రధానోపాధ్యాయురాలు ఎస్ఆర్యన్వివిఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చప్పిడివారిపాలెం, అవిడి, కొత్తపేట మండలం వారు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది నవనీత్ని అభినిందించారు.


# ఓటు హక్కును పరిరక్షించుకోండి



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు పరిరక్షణ కోసం భాతర ఎన్నికల సంఘం (సీఈసీ) ప్రవేశపెట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కందుల కుశరాజు అన్నారు. ఆలమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల్లో 60088 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నియమించిన బీఎల్ఓల ద్వారా ప్రస్తుత ఓటర్లకు రెండు ఫారాలు అందుతాయన్నారు. వాటిని యధావిధిగా పూరించి బీఎల్ఓలకు అప్పగించాలన్నారు. ఈనెల 15న ప్రారంభమైన సర్ జూలై 14 వరకూ నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. అయితే ఈసర్ పక్రియ 2002 ఓటరు జాబితా ఆధారంగా జరుగుతుందన్నారు. ఆసమయంలో ప్రస్తుత ఓటరుకు కాని తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉన్నా యధావిధిగా ఓటు హక్కు కొనసాగుతుందన్నారు. సర్లో ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే సత్వరమే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని తహసీల్దార్ కుశరాజు పేర్కొన్నారు.

# అనుమతి లేకుండా అడ్మిషన్లు తీసుకుంటే చర్యలు

## డీవైఈఓ వెంకటేశ్వరరావు హెచ్చరిక



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పాలమూరు మండల పరిధిలో ప్రైవేట్ పాఠశాలల్లో అనుమతులు లేకుండా 05 నుంచి 10వ తరగతిలో ఆడ్మిషన్లు కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొత్తపేట డీవైఈఓ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని చెముడులంకలోనున్న నేతాజీ ఇంగ్లీషు మీడియం స్కూల్ తనిఖీ జరిగింది. ఈసందర్భంగా స్కూల్లో అనుమతి లేకుండా 8,9,10 తరగతులు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే అనుమతికి మించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినట్లు నిర్ధారించారు. ఈమేరకు షోకాజ్ నోటీసుల జారీ చేయాలని ఎంఈఓలు భమిడిపాటి అప్పాజీ, ఎన్.రాజును డీవైఈఓ వెంకటేశ్వరరావు ఆదేశించారు. విద్యార్థులకు కనీస సౌకర్యాలను అందించే విధంగా మెరుగైన చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లోనున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలలకు 8,9,10 తరగతులకు అనుమతులు లేవని, కేవలం నర్సరీ నుంచి ఏడవ తరగతి వరకూ మాత్రమే అనుమతులు ఉన్నాయని డీవైఈఓ వెంకటేశ్వరరావు అన్నారు.

# అమరనాథ్ క్షమాపణలు చెప్పాలి

## హోం మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళల అలంకరణ పై విమర్శలు చేయడం మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కొత్తపేట నియోజకవర్గ తెలుగు మహిళలు మాజీమంత్రి వైసీపీ నాయకుడు అమర్నాథ్ వ్యాఖ్యలు నిరసిస్తూ కొత్తపేటలో కొత్తపేట నియోజకవర్గ తెలుగు మహిళ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమర్నాథ్ పోస్టర్ పై కోడిగుడ్డు విసిరి మహిళలు నిరశన తెలియజేశారు. తక్షణం అమర్నాథ్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు యల్లమెల్లి చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, చిన్నారుల భద్రతపై అగాహన సదస్సు




**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహిళలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారిపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు అవగాహన పెంపొందించడం లక్ష్యంగా సఖినేటిపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు, విద్యార్థినులు, యువతులు, గ్రామ పెద్దలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై జరుగుతున్న వేధింపులు, దాడులు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. మహిళలు తమ హక్కుల గురించి తెలుసుకుని, ఎటువంటి సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. చిన్నారుల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టం, మహిళల రక్షణకు సంబంధించిన చట్టాలు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన హెల్ప్లైన్ నంబర్లు 100, 112, 1098, 181 గురించి వివరించారు. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, తెలియని వ్యక్తులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని సూచించారు. మహిళలు, బాలికలు తమపై ఎవరైనా అనుచితంగా ప్రవర్తించినా, వేధించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, విద్యార్థినులు పోలీసు అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించగా, అధికారులు వాటికి సమాధానాలు ఇచ్చి భద్రతా సూచనలు అందించారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచి మహిళలు, చిన్నారులకు సురక్షిత వాతావరణం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసు అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. మహిళలు మరియు చిన్నారుల సంక్షేమం కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని సఖినేటిపల్లి పోలీసులు తెలిపారు.

# స్కానింగ్ సెంటర్‌లు దుర్వినియోగం కాకుండా నిఘా పెంచండి : కలెక్టర్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** మంగళవారం రాత్రి కలెక్టరేట్ కోర్ట్ హాలులో డిస్టిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రోప్రియెట్ అథారిటీ, మరియు డిస్టిక్ లెవెల్ అడ్వైజరీ కమిటీ, జిల్లా స్థాయి పీసీ, పీఎన్‌డీటీ సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరీంధిర ప్రసాద్ అధ్యక్షతన జరిగాయి.ఈ సమావేశంలో మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వారు జి.ఆనంది జూమ్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా మరింత పెచాలన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆడ శిశువు పట్ల వివక్షతతో జరిగే భ్రూణ హత్యలను నివారించడంతో పాటు, డివిజన్ స్థాయిలో ఆడబిడ్డల పరంగా లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, డెకాయ్ ఆపరేషన్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జనాభాలో లింగ అసమతౌల్యం వల్ల ఎదురైయ్యే పరిణాలపైన, ఆడ బిడ్డల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను గురించి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అవగాహన పెంపొందించాలని మూడవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వారు జి. ఆనంది అధికారులకు సూచించారు. అలాగే సమావేశంలో మూడు కొత్త స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్, తొమ్మిది సెంటర్ల రెన్యువల్ లు , మూడు సెంటర్ల మూసివేత, రెండు యాడింగ్ అఫ్ మెషిన్, ఇద్దరు ఉద్యోగుల మార్పు, ఒక మెషిన్ చేంజ్ , మరోక ఉద్యోగి తొలగింపు సంబంధించిన ప్రతిపాదనలకు కమిటి ఆమోదం తెలిపింది. జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన 162 స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు సక్రమంగా నిర్వహించడం జరుగుతోందని, ఏప్రిల్ నెల నుండి జనవరి నెల వరకు 8 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించగా 77 స్కానింగ్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహా నాయక్ తెలియజేసారు. జిల్లాలో చట్ట వ్యతిరేకంగా గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలు, అనుమతూలులేని స్కానింగ్ కేంద్రాలు, అర్హత లేని వైద్యులు వివరములు తెలిసిన వారు టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 3365 కుగానీ, వాట్సాప్ నెంబర్ 9494113365 కుగానీ తెలియ చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో డీఐవో డా. కె.వి. సుబ్బ రాజు, డి.సి.హెచ్.ఎస్. డా. మహేశ్వర రావు , జి.జి.హెచ్. సి.ఎస్.ఆర్.ఎం.ఒ డా. పి. కోమల, జి.జి.హెచ్. నుండి వచ్చిన హెచ్.ఒ.డి.లు,డా.సత్య సునీత రేడియాలజీ, డా. రాంబాబు పిడియాట్రిక్ ,డా. జి. సురేష్ కుమార్ గైనిక్, డా. స్వప్న పేథాలజీ డిపార్టుమెంటు వారు,పోలీస్ శాఖ నుండి ఐ . దుర్గా ప్రసాద్ సీఐ ,అసిస్టెంట్ పబ్లిక్ ప్రొసీక్యూటర్ శ్రీ డి. నాగబాబు,ఎన్.జి.ఒ లు ఎస్. అప్పల నాయుడు, కరణం వెంకటేశ్వరరావు , పెద్దాపురం డివిజన్ సూపర్విజింగ్ ఆఫీసర్ డా, ఎన్.ప్రశాంతి, హెచ్ ఈఈ ఓ . కె. సూర్యచంద్ర రావు, డిప్యూటీ డి ఈ ఎం ఓ కె. కృష్ణ ప్రసాద్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# తిప్పరాజుపాలెంలో ఘనంగా సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ పంపిణీ

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కాజులూరు మండలం తిప్పరాజుపాలెం గ్రామంలో రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ పుట్టినరోజు సందర్భంగా జూన్ 16వ తేదీ మంగళవారం మహిళలకు ఉచిత సర్వైకల్ క్యాన్సర్ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సూపర్ స్టార్ మహేష్ బాబు ఫౌండేషన్ సౌజన్యంతో రోటరీ క్లబ్ కాకినాడ వారిచే క్లబ్ అధ్యక్షులు తాడాల బుజ్జి ఆధ్వర్యంలో ఈ సామాజిక సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తిప్పరాజుపాలెం గ్రామానికి చెందిన అమలకంటి వెంకట మహేష్ నిర్దేశికత్వంలో జరిగిన ఈ మెడికల్ క్యాంపుకు స్థానిక మహిళల నుండి విశేష స్పందన లభించింది. వ్యాక్సిన్ వేయించుకునేందుకు గ్రామానికి చెందిన మహిళా మణులంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి క్యూ కట్టారు. ఈ కార్యక్రమానికి గౌరవ కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ శిబిరానికి వచ్చిన మహిళలందరికీ సర్వైకల్ క్యాన్సర్ వ్యాధి పట్ల, ముందస్తు వ్యాక్సినేషన్ ప్రాధాన్యత పట్ల చక్కని అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఇటువంటి మంచి కార్యక్రమాన్ని తన పుట్టినరోజున ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. పూర్తిస్థాయిలో విజయవంతమైన ఈ సేవా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ యాళ్ల ఆంజనేయ వరప్రసాద్, తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఆనాల శ్రీను, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు చీకట్ల హరిబాబుతో పాటు ప్రముఖులు అన్యం శ్రీరామచంద్రమూర్తి, యాళ్ల లక్షబాబు, చోడిశెట్టి మురలీకృష్ణ, ఇంటి వీరబాబు, ఆనాల చంటియ్య, దూబా గంగరాజు, ఆనాల విష్ణుమూర్తి, కొండమూరి వినయ్, జెక్కే శ్రీనివాస్ మరియు గ్రామ పెద్దలు, యువకులు, రోటరీ క్లబ్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 12 ఏళ్ల మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి : ఎమ్మెల్యే నల్లమిల్లి




**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని 'సర్' రాష్ట్ర కన్వీనర్ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు.12 ఏళ్ల మోడీ పాలనలో బీజేపీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం కాకినాడలో ఓ హోటల్లో దేశం సాధించిన అభివృద్ధిపై విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి పెద్దిరెడ్డి రవికిరణ్ వివరాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మోడీ 12 ఏళ్లుగా ఓటింగ్ ద్వారా ఎంపికైన ప్రధానిగా పనిచేసి ఎన్నో రంగాలలో అభివృద్ధి సాధించారన్నారు. ప్రపంచంలో అతిపెద్ద నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు ఇంకా 10 కోట్ల మందికి గ్యాస్ కనెక్షన్లు, పీఎం ఆవాస్ ద్వారా నాలుగు కోట్ల గృహాలు అందించారని చెప్పారు. స్వచ్ఛభారత్ పథకం ద్వారా కరెంట్ కోట్ల మరుగుదొడ్లను నిర్మించి ఆత్మాభిమానం కాపాడిందన్నారు.11వేల కిలోమీటర్లు మెట్రో రైల్వే లైన్ వేసి124 మంది వందే భారత్ రైళ్లను ప్రయాణికులకు అందించిందన్నారు. ఇంకా సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సింధూర్ వంటి కార్యక్రమాలు చేబట్టి ఉగ్రవాదాన్ని నిరోధించిందన్నారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా ఏర్పాటు చేసి ప్రపంచంలో పేరు, ప్రఖ్యాతలను ప్రధాని మోదీ భారతదేశంకు గౌరవంను తీసుకొచ్చారన్నారు. కాకినాడ- రాజమహేంద్రవరం కెనాల్ రోడ్డు జాతీయ రహదారిగా వెడల్పు చేస్తామని నల్లమిల్లి చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న, బీజేపీ నాయకులు యెనిమిరెడ్డి మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, కుండల సాయికుమార్, చక్కా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 18న రాష్ట్ర ప్రభుత్వం

# రెండేళ్ల పరిపాలన విజయోత్సవ వేడుకలు

### కాకినాడ జిల్లా స్థాయిలో ప్రత్తిపాడులో నిర్వహణ ఏర్పాట్లు



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా జరుపుతున్న రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం వేడుకలు కాకినాడ జిల్లా స్థాయిలో ఈ నెల 18వ తేదీన ప్రత్తిపాడులో జరుగుతాయని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలియజేశారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా ఈ నెల 18న ప్రత్తిపాడులో రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం నిర్వహించేందుకు చేపట్టవలసిన సన్నాహక చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికూల ఆర్థిక పరిస్థితులు, సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గడచిన రెండేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు పరస్తోందని, ఈ విజయాల స్ఫూర్తితో మరింత ముందుకు సాగేందుకు, రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం పేరిట వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఈ వేడుకలను కాకినాడ జిల్లాలో ఈ నెల 18వ తేదీన ప్రత్తిపాడులో నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందని, వేడుకలలో రెండేళ్లలో ప్రభుత్వం అమలు పరిచిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పునరావలోకనం చేసి, అవి లబ్దిదారుల జీవితాలను అనందమయం చేసిన తీరును వారితో ముచ్చటించడం జరుగుతుందన్నారు. 18వ తేదీన ప్రత్తిపాడులో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1-00 గంట వరకూ జరిగే ఈ వేడుకలను అన్నదాత సుఖీభవ -- రైతులకు బాసట అనే ప్రత్యేక థీమ్ తో కాకినాడ జిల్లాలో నిర్వహించడం జరుగుతుందన్నారు. వేడుకల వేదిక వద్ద వ్యవసాయం, ఉద్యానవన, రైతు సాధికరతా సంస్థ, విద్య, ఐసిడిఎస్ తదితర 8 శాఖలు స్టాళ్లను ఏర్పాటు చేసి తమ తమ శాఖల ద్వారా అమలౌతున్న పథకాల సమాచారంతో ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పెద్దాపురం ఆర్డిఓ పి.కృష్ణమూర్తి, జడ్పి సిఈఓ వివివిఎస్ లక్ష్మణరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వృద్ధుల వేధింపుల నివారణపై అవగాహన ర్యాలీ

- వృద్ధులను ఆదరించడం కుటుంబ సభ్యుల బాధ్యత
- జిల్లాకు ఒక వృద్ధాశ్రమ నిర్మాణాశీపై ప్రభుత్వం దృష్టి సారించాలి
- వృద్ధులు భారమైతే రోడ్డున పడేయకండి స్వర్ణాంధ్రకు అప్పగించండి
- స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకులు రాంబాబు అభ్యర్థన



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో వృద్ధులపై పెరుగుతున్న వేధింపులు అరికట్టాలని, వృద్ధుల సంరక్షణ చట్టాలను మరింత కఠినంగా అమలు చేయాలని స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. సోమవారం మధ్యాహ్నం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా దుర్గమ్మ గుడి ట్రాఫిక్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి వృద్ధులపై జరుగుతున్న వేధింపులు అరికట్టాలని వృద్ధులకు రక్షణ కల్పించాలని వృద్ధుల రక్షణ చట్టాలు కఠినంగా అమలు చేయాలని నినాదాలు చేశారు. జిల్లాకు వృద్ధాశ్రమం నిర్మిస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా కార్యాచరణ చేయాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు. స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు నేతృత్వంలో జరిగిన ఈ ర్యాలీలో వృద్ధులు నిరాశ్రయులు స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సమాజంలో ఆస్తులు, డబ్బు కోసం వృద్ధులపై వేధింపులు ఎక్కువయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సరైన సంపాదనలేని కుటుంబ సభ్యులు పేదరికం వల్ల వృద్ధులను నిర్లక్ష్యంగా బయటికి గెంటేస్తున్నారని ఇది అత్యంత దుర్మార్గమైన చర్యగా రాంబాబు అభిప్రాయపడ్డారు. వృద్ధులు కుటుంబాలకు భారమైతే వారి దయనీయమైన స్థితిని వివరించి ఏదైనా ఆశ్రమంలో చేర్చాలని రాంబాబు కుటుంబ సభ్యులను కోరారు . 28 సంవత్సరాలుగా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ద్వారా కొన్ని వందల మందికి ఆశ్రమం లో ఆశ్రయం కల్పించి, కొంతమందికి పునరావాసం కల్పించి, కొంతమందిని వారి కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. చిన్న చిన్న మానసిక సమస్యల వల్ల కుటుంబ తగాదాల వల్ల సొంత కుటుంబ సభ్యుల నిర్లక్ష్యం వల్ల వృద్ధులు రోడ్డున పడుతున్నారని రాంబాబు ఆవేదన వ్యక్తం చేశారు .వృద్ధాశ్రమం ద్వారా అనేకమంది వృద్ధులకు ఆసుపత్రిలో చేర్చి వైద్య సహాయం అందిస్తున్నామని వృద్ధాప్యంలో కావలసిన ఉపకరణాలు ఉచితంగా అందించడంతోపాటు దహన సంస్కారాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది కె.దివ్య,జీ. మీరా కుమారి,హరికృష్ణ, సత్య, రాజేష్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్ఐ హోదా పదోన్నతి పొందిన

# ఆర్ఎస్ఐని సత్కరించిన జిల్లా ఎస్పీ



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆర్ఐ (రిజర్వ్ ఇన్‌స్పెక్టర్) హోదాకు పదోన్నతి పొందిన ఆర్ఎస్ఐ జి.త్రినాధరావుకి షోల్డర్ స్ట్రాప్స్‌పై మూడవ స్టార్‌ను అలంకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉన్నత హోదాలో మరింత బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తూ, తన ఆధీనంలో పనిచేసే సిబ్బందికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తూ పోలీసు శాఖలో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వి.జి. శ్రీహరి రావు, ఆర్ఐ ఎం.నరసింహామూర్తి తదితరులు పాల్గొని జి.త్రినాధరావుకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అనుమతులు లేని ఫ్లెక్సీలను తొలగించాలి

### తొలగింపునకు వారి నుండే రుసుము వసూలు చేయాలి : కలెక్టర్ హరేంధిర ప్రసాద్

**కాకినాడ, కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కేంద్రం కాకినాడతో పాటు అన్ని మున్సిపాలిటీల్లో రోడ్ల డివైడర్లు, కూడళ్ళలో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తూ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలన్నిటినీ వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ మున్సిపల్ కమీషనర్లను ఆదేశించారు. పట్టణాల్లోని రోడ్ల మధ్య స్తంభాలపైన, రద్దీగా ఉండే కూడళ్ళలో స్థానిక సంస్థల నుండి ఎటువంటి అనుమతి లేకుండా అస్తవ్యస్తంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలు వాహన చోదకులకు, పాదచారులకు పరిసరాలు కనబడకుండా అవరోధంగా నిలిచి ప్రమాదాలకు కారణమౌతున్నాయని, నిత్యం బాధిత ప్రజల నుండి వీటిపై ఫిర్యాదులు అందుతున్నాయని కలెక్టర్ తెలిపారు. పట్టణాలను అందవికారంగా చేస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న ఫ్లెక్సీలన్నిటినీ వెంటనే తొలగించి అందుకు అయిన ఖర్చును, అనుమతి లేకుండా ఫ్లెక్సీలను ప్రదర్శించినందుకు జరిమానాలను వాటిని ఏర్పాటు చేసిన వారి నుండి వసూలు చేయాలని మున్సిపల్ కమీషనర్లను కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు లేకుండా తరచూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తూ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరేందిర ప్రసాద్ హెచ్చరించారు.

# జీవన శైలిలో యోగా భాగం కావాలి : ఎంపీడీవో భారతి




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం వేలంపేట రామాలయంలో యోగంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువులు రాజయోగ సాధన, మెడిటేషన్ వలన కలిగే ప్రయోజనాలను వివరించి అందరితో గంటపాటు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎం.భారతి మాట్లాడుతూ భారతీయుల సనాతన సంపద అయిన యోగాను ప్రతి ఒక్కరూ తమ జీవన శైలిలో భాగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తో పాటు డిప్యూటీ ఎంపీడీవోలు కెవిఎస్ఎస్ మూర్తి, ఎం వెంకటరెడ్డి మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### మైనారిటీల అభివృద్ధికి రూ.40 కోట్ల


# అదనపు నిధుల విడుదల స్వాగతార్హం

### ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధానమంత్రి జన వికాస్ కార్యక్రమం అమలుకోసం మైనారిటీల సంక్షేమ శాఖకు రూ.40 కోట్ల అదనపు నిధులను విడుదల చేయడం హర్షణీయమని ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని, ఆయన తీసుకుంటున్న సామాజిక సాధికారత చర్యలు మైనారిటీ వర్గాల్లో కొత్త విశ్వాసాన్ని నింపుతున్నాయని తెలిపారు. మంత్రి నారా లోకేష్ మైనారిటీ యువతకు నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించేందుకు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మైనారిటీల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల సమర్థ అమలులో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఈ అదనపు నిధుల ద్వారా మైనారిటీ ప్రాంతాల్లో విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన మరింత వేగవంతం అవుతుందని అబ్దుల్ అజీజ్ ఆశాభావం వ్యక్తం చేశారు. మైనారిటీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మరింత ఫలితాలను ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.

### రూ. 4 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణానికి

# ఎమ్మెల్యే వనమాడి శంకుస్థాపన



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగర అభివృద్ధిలో కీలకమైన సంజయ్ నగర్ డంపింగ్ యార్డ్ ప్రాంతంలోని 700 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులకు సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మంగళవారం శంకుస్థాపన చేశారు. సుమారు 4 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ రహదారి నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టి ఆయన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ, సర్పవరం జంక్షన్ నుండి పాత పోర్టు పోలీస్ స్టేషన్ వరకు స్మార్ట్ సిటీ నిధులతో రహదారి నిర్మాణం గతంలో చేపట్టినప్పటికీ, మధ్యలో ఉన్న సంజయ్ నగర్ డంపింగ్ యార్డు కారణంగా సుమారు 700 మీటర్ల మేర రోడ్డు నిర్మాణం నిలిచిపోయిందన్నారు. దీంతో ప్రజలు, వాహనదారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంజయ్ నగర్ డంపింగ్ యార్డులో పేరుకుపోయిన ఘన వ్యర్థాలను త్వరలోనే జిందాల్ సంస్థ ఏర్పాటు చేస్తున్న వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ 700 మీటర్ల రోడ్డు నిర్మాణం పూర్తయితే సర్పవరం జంక్షన్ నుంచి పాత పోర్టు పోలీస్ స్టేషన్ వరకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయని, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్వివి సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ దళే పృథ్వీ చరణ్, నాయకులు తుమ్మల సునీత, అల్లం రాజు, ఎరిపిల్లి రాము, మూగు రాజు, చోడిపిల్లి సతీష్, లూటికుర్తి మోహన్, మోసా పేతురు, గాది శివ తదితరులు పాల్గొన్నారు.

# బీసీ బిడ్డకు అండగా నిలిచింది చంద్రబాబు నాయకత్వమే

**మూడేళ్లైనా మరువలేని అమర్నాథ్ గౌడ్ వైసీపీ దారుణ హత్య – బాధిత కుటుంబానికి విద్య, ఆర్థిక భరోసా కల్పించిన సీఎం చంద్రబాబు**
**అమర్నాథ్ కుటుంబాన్ని వైసీపీ విస్మరించింది, టీడీపీ అండగా నిలిచింది – ఆదిరెడ్డి కుటుంబాన్ని వేధించిన వైసీపీకి ప్రజలే గుణపాఠం చెప్పారు**
**బీసీ బిడ్డకు న్యాయం చేయని నాటి జగన్ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుడుపూడి సత్తిబాబు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం ఉప్పలవారిపాలెంకు చెందిన ఉప్పాల అమర్నాథ్ గౌడ్‌ను సజీవదహనం చేసి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహం నుంచి వై-జంక్షన్‌లోని గౌతు లచ్చన్న విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, బీసీల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అమర్నాథ్ గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ర్యాలీ అనంతరం కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ, తన సోదరిని వేధిస్తున్న వారిని ప్రశ్నించేందుకు వెళ్లిన అమర్నాథ్ గౌడ్‌ను అత్యంత దారుణంగా హత్య చేయడం రాష్ట్ర చరిత్రలో మరచిపోలేని ఘటనగా నిలిచిపోయిందన్నారు. ఒక పదో తరగతి విద్యార్థి ప్రాణాలు కోల్పోయినా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గానీ, వైసీపీ ప్రభుత్వం గానీ బాధిత కుటుంబానికి అండగా నిలవకపోవడం దురదృష్టకరమన్నారు. బీసీ యువకుడు దారుణ హత్యకు గురైతే కనీసం పరామర్శించకపోవడం, బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వకపోవడం వైసీపీ ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. బీసీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన వైసీపీ, అధికారంలో ఉన్నంతకాలం బీసీల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. వైసీపీ పాలనలో బీసీలు, ఎస్సీలు, అణగారిన వర్గాలు అనేక అవమానాలు, అన్యాయాలు ఎదుర్కొన్నాయని ఆయన పేర్కొన్నారు. కరోనా సమయంలో రక్షణ కోసం మాస్కులు కావాలని కోరిన డాక్టర్ సుధాకర్ ఎదుర్కొన్న పరిస్థితులు ప్రజలను కలచివేశాయని, అలాగే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకుడు సుబ్రహ్మణ్యం హత్య ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కలిగించిందన్నారు. అణగారిన వర్గాలపై జరిగిన ఘటనల పట్ల ప్రభుత్వం స్పందించిన తీరు ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసిందని అన్నారు. అలాగే బీసీ సామాజిక వర్గానికి చెందిన యువ నాయకుడు, రాజమహేంద్రవరం నగర ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ని, ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావుని నాటి వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణితో వేధించిన ఘటనలను ఈ సందర్భంగా కుడుపూడి సత్తిబాబు గుర్తు చేశారు. ప్రజలకు అండగా నిలిచే బీసీ నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు, వేధింపులతో ఇబ్బందులకు గురిచేసే ప్రయత్నాలు జరిగాయని విమర్శించారు. బీసీ నాయకులను రాజకీయంగా అణచివేయాలనే ధోరణి వైసీపీ పాలనలో స్పష్టంగా కనిపించిందని, అలాంటి అరాచక పాలనను రాష్ట్ర ప్రజలు తిరస్కరించారని, అందుకే 2024 ఎన్నికల్లో వైసీపీకి చరిత్రలో నిలిచిపోయే ఓటమితో తీర్పు ఇచ్చారని పేర్కొన్నారు. అమర్నాథ్ గౌడ్ కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు వెంటనే స్పందించి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారని గుర్తు చేశారు. పార్టీ తరఫున రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబానికి నైతికంగా అండగా నిలిచారని తెలిపారు. అమర్నాథ్ సోదరి హేమశ్రీ చదువు ఆగిపోకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచిత విద్య అందించారని, ప్రస్తుతం విజయవాడలో ఇంజనీరింగ్ చదువుతున్న ఆమె ఉన్నత విద్యకు అవసరమైన సహకారం అందుతోందన్నారు. బాధిత కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం కూడా చేయూత అందిస్తున్నారని తెలిపారు. ఆనాటి వైసీపీ ప్రభుత్వంలో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు కనీసం బాధిత కుటుంబాన్ని పరామర్శించకపోవడం వారి దురహంకారానికి నిదర్శనమని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు బాధితులను పట్టించుకోని వారు ఇప్పుడు సామాజిక న్యాయం గురించి మాట్లాడటం ప్రజలను మభ్యపెట్టడమేనన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని కుడుపూడి సత్తిబాబు తెలిపారు. బీసీ కార్పొరేషన్ల బలోపేతం, సంప్రదాయ వృత్తుల అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల కల్పన, యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక భద్రత పథకాల అమలు వంటి అంశాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యంగా గీత కార్మిక కుటుంబాల ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. శెట్టిబలిజ, గౌడ, ఈడిగ తదితర గీత వృత్తిదారుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ సాధికారతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి బీసీ కుటుంబం అభివృద్ధి చెందే వరకు ఈ కృషి కొనసాగుతుందని కుడుపూడి సత్తిబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నక్కా చిట్టిబాబు, పార్టీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నగర టీడీపీ మహిళా అధ్యక్షురాలు కోసూరి చండీప్రియతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బొబ్బిల్లంకలో పోలీస్ యూత్ కనెక్ట్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో సీతానగరం సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో విలేజ్ విసిటింగ్ యూత్ కనెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు యువతకు సైబర్ నేరాలు, దొంగతనాల నివారణ, రోడ్డు ప్రమాదాల అదుపునకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎస్సై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# అధిక ఫీజులు వసూళ్ళపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వినతి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు యూనిఫాములు విక్రయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు జి.కార్తీక్ సీతానగరం ఎంఈఓ కె.స్వామి నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. అధికారులు తక్షణమే స్పందించి ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, టీ.తరుణ్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాతృశ్రీ భూలోకమ్మ జాతర మహోత్సవాలు





**– బోనాలతో కదం తొక్కిన మహిళలు**

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలంలోని పశ్చిమగోనగూడెం గ్రామదేవత మాతృశ్రీ భూలోకమ్మ జాతర మహోత్సవాలు మూడు రోజులపాటు ఆలయకమిటీ ఘనంగా నిర్వహించారు. మంగళవారం పశ్చిమ గోనగూడెం రాధాకృష్ణనగర్లో వేంచేసియున్న మాతృశ్రీ భూలోకమ్మ జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా గరగ నృత్యాలు, శక్తి వేషధారణలు, మహిళలు పెద్ద ఎత్తున బోనాలు ఎత్తుకొని గ్రామోత్సవంలో కదం తొక్కారు. మూడు రోజులపాటు నిర్వహించిన జాతరలో భాగంగా భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి అమ్మ వారిని దర్శించుకోని పసుపు కుంకుమల సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతృశ్రీ భూలోకమ్మ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణం నిమిత్తం విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళాన్ని అందజేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం రాత్రి జాతర ముగింపును పురస్కరించుకొని తీన్మార్ డప్పులతో గరగ నృత్యాలతో "జాతర జాగారం" వైభవంగా జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు కోమలి కృష్ణ, చొల్లంగి వీరబాబు, మేడిశెట్టి శ్రీను, ఏకుల పోసి, పిల్లి బూరయ్య, బొంతు రామారావు, పిల్లి వీరబాబు, ఇళ్ళ నరసింహమూర్తి, దెయ్యాల నాగేశ్వర రావు, పిల్లి శ్రీను, పెద్ద ఎత్తున మహిళ భక్తులు పాల్గొన్నారు.

# బేషరతుగా మంత్రి అనితకు, మహిళలకు క్షమాపణ చెప్పాలి


**మహిళల గౌరవాన్ని కించపరిచేలా వైసీపీ అమర్నాథ్ వ్యాఖ్యలు – రాజమండ్రి తెలుగు మహిళలు డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన వ్యాఖ్యలు మహిళలను కించపరిచేలా ఉన్నాయని తెలుగు మహిళలు అన్నారు. హోంమంత్రి వంగలపూడి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత, అవమానకర వ్యాఖ్యలను తెలుగు మహిళ నాయకురాళ్లు తీవ్రంగా ఖండించారు. గోరక్షణపేటలోని శ్రీకారం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాజమండ్రి పార్లమెంట్ తెలుగు మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, రాజమహేంద్రవరం నగర తెలుగు మహిళ అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కప్పల వెలుగు కుమారి మాట్లాడారు. మహిళల పట్ల గౌరవం లేకుండా వ్యక్తిగత విమర్శలకు దిగడం వైసీపీ నాయకుల సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. ఒక సాధారణ కార్యకర్తగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి ఎమ్మెల్యేగా, తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా, ప్రస్తుతం రాష్ట్ర హోంమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న అనిత ప్రజాసేవలో విశిష్ట పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆమె వ్యక్తిగత అలంకరణ, వస్త్రధారణ, మేకప్ వంటి అంశాలపై వ్యాఖ్యానించడం ద్వారా గుడివాడ అమర్నాథ్ కేవలం ఒక మహిళను మాత్రమే కాకుండా యావత్ మహిళా సమాజాన్ని అవమానించారని మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైసీపీ నేతలు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రోత్సహిస్తున్నారనే భావన ప్రజల్లో కలుగుతోందన్నారు. మహిళలను కించపరిచే భాషను ఉపయోగించే నాయకులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జగన్‌మోహన్ రెడ్డిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు ఇప్పటికే వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారని, అయినప్పటికీ ఆ పార్టీ నాయకుల వైఖరిలో మార్పు కనిపించడం లేదని విమర్శించారు. దేశవ్యాప్తంగా మహిళా సాధికారతకు ప్రాధాన్యత పెరుగుతున్న ఈ సమయంలో ఒక మాజీ మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి మహిళల వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ మాట్లాడడం అత్యంత దురదృష్టకరమన్నారు. మహిళలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మరింత ప్రాతినిధ్యం కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్న వేళ ఇలాంటి వ్యాఖ్యలు సమాజానికి తప్పు సంకేతాలు ఇస్తాయన్నారు. హోంమంత్రి అనిత ఉపాధ్యాయురాలిగా తన జీవితం ప్రారంభించి, ప్రజా ఉద్యమాలు, పార్టీ కార్యక్రమాల ద్వారా ఎదిగి రాష్ట్ర రాజకీయాల్లో విశిష్ట స్థానం సంపాదించుకున్నారని వివరించారు. గుడివాడ అమర్నాథ్ తన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకుని హోంమంత్రి వంగలపూడి అనితకు, మహిళా సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అలాగే వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి కూడా ఈ ఘటనపై స్పందించి మహిళలను అవమానించే వ్యాఖ్యలను ఖండించాలని కోరారు. అనిత దళిత మహిళగా అత్యున్నత స్థాయికి ఎదిగి రాష్ట్రానికి సేవలందిస్తున్న నేపథ్యంలో ఆమెపై జరిగిన వ్యక్తిగత విమర్శలు దళిత మహిళల మనోభావాలను కూడా దెబ్బతీశాయని పేర్కొన్నారు. అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా తెలుగు మహిళ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మీడియా సమావేశం అనంతరం తెలుగు మహిళలు, కార్యకర్తలు గుడివాడ అమర్నాథ్ చిత్రపటాన్ని గుడ్లు, చెప్పులతో కొట్టి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. మహిళల గౌరవాన్ని కాపాడే పోరాటంలో వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో తెలుగు మహిళలు తురకల నిర్మల, తుళ్లి పద్మ, లీలావతి, కర్ణం లక్ష్మీ నాయుడు, దొంగ నాగమణి, కానేటి కృపామణి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# పూర్వపు విద్యార్థులు అపూర్వ కలయిక

**48 ఏళ్ల తర్వాత కలిసిన ఎస్ఎస్‌సి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మున్సిపల్ హైస్కూల్, రాజమహేంద్రవరంలో 1977–78 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన 50 మంది పూర్వ విద్యార్థులు 48 సంవత్సరాల తర్వాత మళ్లీ కలిసి అపూర్వమైన ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో కొనసీమ జిల్లా, దిండీలోని రిసార్ట్‌లో జూన్ 13,14 ఈ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. బాల్య స్నేహితులతో మళ్లీ కలుసుకున్న ఆనందంలో ఉపాధ్యాయులను స్మరించుకుని, ఆటపాటలతో వినోదాన్ని పంచుకున్నారు. "పూర్వ విద్యార్థులు అపూర్వ కలిక" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సమ్మేళనం భవిష్యత్తులో పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు అందరూ వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ జ్ఞాపకాలను భద్రపరిచేందుకు "అపూర్వ కలిక" పేరుతో స్మారక ఫోటో ఆల్బమ్‌ను తయారు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన షేక్ గౌస్ బడే పాషా ని అందరూ అభినందించారు. 2029లో గోల్డెన్ జూబిలీ వేడుకలను కూడా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.


# అత్యవసర సమయంలో ఫస్ట్ ఎయిడ్ ప్రాణాలను కాపాడుతుంది



**బి.విజయకుమార్ ఐఎఫ్ఎస్**


**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అత్యవసర పరిస్థితుల్లో అందించే ప్రథమ చికిత్స (ఫస్ట్ ఎయిడ్) ప్రాణాలను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ బి. విజయకుమార్, ఐఎఫ్ఎస్ పేర్కొన్నారు. మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో లాలాచెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ ప్రాంగణంలో బేసిక్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారికి ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీపీఆర్ విధానం, వివిధ అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన ప్రథమ చికిత్స, అటవీ ప్రాంతాల్లో పాముకాటు సంభవించినప్పుడు చేయాల్సిన ప్రాథమిక చికిత్సలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్లు టి. శ్రీనివాసరావు, బి. రామారావు, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.వి. రమణ, కోశాధికారి డాక్టర్ జి. మహాలక్ష్మి, ఎంసీ సభ్యులు బళ్ళా శ్రీనివాసరావు, డీడీఓ బి. విజయ, ఎఫ్ఆర్ఓలు లలిత కుమారి, ఎస్.కె. షరీఫ్, ట్రైనర్ చిన్ని సత్యనారాయణ (చంటి), డీఎఫ్ఓ గోపీకృష్ణ, పద్మ, భావనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పుక్కాల శ్రీనివాస్ 50వ పుట్టినరోజు వేడుకలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలం ప్రభుదేవా పురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సీతానగరం మండల సోషల్ మీడియా కన్వీనర్ పుక్కాల శ్రీనివాస్ జన్మదిన వేడుక ఉపాధి హామీ కూలీల ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరిగింది. వారు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆశీర్వచనాలు, ఎన్టీఆర్ ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఆయనపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామన్నారు. శ్రీనివాస్ మాట్లాడుతూ మీ ప్రేమ ఆప్యాయతలు మరువలేనివని మీమధ్య పుట్టినరోజు జరుపుకోవడం నాకు చాలా ఆనందంగా ఉందని వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. రుడా చైర్మన్, రాజానగరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు తూర్పుగోదావరి జిల్లా టిడిపి పార్టీ అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి పుక్కాల శ్రీనివాస్ కు జన్మ దిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# మండపేటను అన్ని విధాల అభివృద్ధికి కృషి



**డ్రైనేజీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే వేగుళ్ళ**

**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తున్నామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట పట్టణ పరిధిలో 1,2,3 వార్డులలో మంగళవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు మోటర్ సైకిల్ పై పర్యటించారు. కూటమి నాయకులు, మున్సిపల్ అధికారులు, సచివాలయాల సిబ్బందితో కలసి ఆయా వార్డులలో పర్యటించారు. బైక్ పై ప్రతీ వీధిలో పర్యటించి వార్డులలో చేపట్టాల్సిన సి.సి రోడ్లు, డ్రైన్ పనులను స్వయంగా పరిశీలించారు. గుర్తించిన పనులను త్వరలోనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వార్డులో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం పనిచేస్తున్నామని అన్నారు. ముఖ్యంగా మండపేట శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. సి.సి డ్రైన్ లు, సి.సి రోడ్ల నిర్మాణం పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. వీరభద్రపురం మొదలుపెట్టి ఆయా వార్డుల్లో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల మాజీ కౌన్సిలర్ లు, వార్డు ఇన్ ఛార్జ్ లు, మున్సిపల్ డిఈ శ్రీనివాస్, ఏ ఈ అనూష, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయుని వితరణ




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల అభివృద్ధికి విద్యార్థులకు సౌకర్యాలను కలిగించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి.భాస్కరరావు అన్నారు. మండలంలోని రాజుపాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం స్వీకరించేందుకు అవసరమైన నాణ్యత కలిగిన స్టీల్ లంచ్ ప్లేట్లను సమకూర్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు విద్యార్థికి రెండు నేత్రాల వంటి వారిని బాధ్యతలు కలిగి ఉండాలని తల్లిదండ్రులు ప్రతిరోజు పిల్లలతో కొంత సమయం గడిపేలా దినచర్య ఉండాలని తెలియజేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా విద్యామిత్ర కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. పాపారావు, ఉపాధ్యాయురాలు టి ఎల్ ఎన్ జ్యోతి, ఎస్ ఎం సి సభ్యులు తల్లిదండ్రులు మరియు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




నేను అడిగిన ప్రశ్నకు

# ప్రభాస్ ఇచ్చిన ఆన్సర్ విని ఆశ్చర్యపోయా..

## రామ్ గోపాల్ వర్మ



టాలీవుడ్ సక్సెస్ ఫుల్ దర్శకులలో రామ్ గోపాల్ వర్మ ఒకరు. ఒకప్పుడు తెలుగులో ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన ఆయన.. ఇప్పుడు దర్శకత్వానికి దూరంగా ఉంటున్నారు. కానీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటున్నారు. లేటేస్ట్ చిత్రాలపై తన అభిప్రాయాలను తెలియజేస్తూనే.. మరోవైపు పలు విషయాలపై స్పందిస్తున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో వర్మ చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరలవుతున్నాయి. డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఆయన సినిమాలకు ఉండే ఫాలోయింగ్ సైతం తెలిసిందే. ఒకప్పుడు ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన ఆయన.. ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. హీరో ప్రభాస్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. అలాగే తాను అడిగిన ప్రశ్నకు డార్లింగ్ ఇచ్చిన ఆన్సర్ విని షాకయ్యానని అన్నారు. అసలు విషయానికి వస్తే.. టాలీవుడ్ జక్కన్న ఎస్.ఎస్. రాజమౌళి, రెబెల్ స్టార్ ప్రభాస్ కాంబినేషన్‌లో వచ్చిన 'బాహుబలి' చిత్రం భారతీయ సినీ చరిత్రను తిరగరాసింది. ఈ సినిమా కోసం ప్రభాస్ తన కెరీర్‌లో అత్యంత కీలకమైన ఐదేళ్ల కాలాన్ని కేటాయించారు. అయితే, ఈ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో ప్రభాస్ చూపించిన అంకితభావం, దర్శకుడిపై ఆయనకున్న నమ్మకం గురించి రామ్ గోపాల్ వర్మ చెప్పిన మాటలు ఇప్పుడు నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

**6 నెలలు కాదు.. 6 ఏళ్లయినా ఇస్తాను!**

ఒకానొక సందర్భంలో ఆర్‌జీవీ స్వయంగా ప్రభాస్‌ను ఒక ప్రశ్న అడిగారట. ఒకే సినిమా కోసం ఆరు నెలల పాటు పూర్తి సమయాన్ని కేటాయించడం పట్ల ఎప్పుడైనా విచారం లేదా బాధ కలిగిందా అని ఆర్‌జీవీ ప్రశ్నించగా.. ప్రభాస్ ఇచ్చిన సమాధానం తనను తీవ్ర ఆశ్చర్యానికి గురిచేసిందని వర్మ వెల్లడించారు. “”సర్, ద వే ఫిల్మ్ ఈజ్ షేపింగ్ అప్, ఈ సినిమా షేప్ అవుతున్న విధానం చూస్తుంటే.. మూడు సంవత్సరాలు కాదు, ఇప్పుడు ఇప్పుడే ఆరు సంవత్సరాలు అడిగినా నేను రాజమౌళి గారికి ఇచ్చేస్తాను” అని ప్రభాస్ ఎంతో నమ్మకంతో బదులిచ్చారట.

**ప్రభాస్ కమిట్‌మెంట్‌కు ఆర్‌జీవీ హాట్సాఫ్**

ప్రభాస్ నోట వచ్చిన ఈ మాటలు ఆయనకు సినిమా పట్ల ఉన్న అపారమైన కమిట్‌మెంట్‌ను, ప్రాజెక్ట్ విజయంపై ఆయనకున్న దృఢమైన నమ్మకాన్ని తెలియజేస్తాయని ఆర్‌జీవీ ప్రశంసించారు. ఒక స్టార్ హీరో తన కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఇలాంటి నిర్ణయం తీసుకోవడం సామాన్యమైన విషయం కాదని, అది కేవలం ప్రభాస్‌కు మాత్రమే సాధ్యమైందని ఆయన అన్నారు. దర్శకుడు రాజమౌళి తన నిజాయితీ, పని పట్ల ఉన్న నిబద్ధత ద్వారానే ప్రభాస్‌లో అలాంటి అచంచలమైన విశ్వాసాన్ని కలిగించగలిగారని ఆర్‌జీవీ వివరించారు. కథపై దర్శకుడికి ఉన్న స్పష్టత, నటీనటులను నడిపించే తీరు చూశాకే ప్రభాస్ తన సర్వస్వాన్ని ఆ సినిమా కోసం ధారపోశారని, అందుకే 'బాహుబలి' అంతటి ప్రపంచ స్థాయి విజయాన్ని సాధించిందని అన్నారు. నిజానికి బాహుబలి సినిమాతో ప్రభాస్ స్థాయి ప్రపంచవ్యాప్తంగా మారిపోయింది.

## ప్రియుడితో బ్రేకప్..

# ఇన్ స్టాలో ఫోటోస్ డిలీట్ చేసిన టాలీవుడ్ హీరోయిన్



ప్రస్తుతం సినీరంగంలో లవ్, బ్రేకప్, డివోర్స్ అనేవి సర్వసాధారణంగా మారిపోయాయి. ప్రతి సెలబ్రెటీ లైఫ్, పర్సనల్ విషయాలు ఇప్పుడు తెగ వైరలవుతున్నాయి. అలాగే సినీతారల బ్రేకప్, డివోర్స్ విషయాలు ప్రధాన ఇన్ స్టా ఫోటోస్ పైనే ఆధారపడి ఉంటున్నాయి. తాజాగా ఓ టాలీవుడ్ హీరోయిన్ ఇన్ స్టాలో తన ప్రియుడితో కలిసి ఉన్న ఫోటోస్ డిలీట్ చేసింది. దీంతో ఇప్పుడు ఆమె గురించి నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? సాధారణంగా చిత్రపరిశ్రమలో ప్రేమలు, నిశ్చితార్థాలు, ఆపై బ్రేకప్‌లు కామన్‌గా మారిపోయాయి. తాజాగా టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్న నటి సునయన తన ప్రియుడితో విడిపోయినట్లు టాక్ నడుస్తుంది. అందుకు కారణం ఆమె ఇన్ స్టాలో తన ప్రియుడితో కలిసి ఉన్న ఫోటోస్ డిలీట్ చేయడమే. తెలుగులో పలు చిత్రాల్లో నటించిన ఈమె, ఇటీవలే ధనుష్, నాగార్జున ప్రధాన పాత్రల్లో వచ్చిన ప్రతిష్టాత్మక చిత్రం 'కుబేర' లో కీలక పాత్రలో నటించింది. గత ఏడాది కాలంగా సునయ దుబాయ్ కు చెందిన ఓ వ్యాపారవేత్తతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరిగింది. అంతేకాకుండా, కొద్ది నెలల క్రితం తన నిశ్చితార్థానికి సంబంధించిన కొన్ని ఫోటోలను ఇన్ స్టాగ్రామ్‌లో షేర్ చేసి అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఒక వ్యక్తి చేయి పట్టుకున్న ఫోటోను పెట్టి, తన లైఫ్ పార్ట్‌నర్‌ను త్వరలోనే పరిచయం చేస్తానని హింట్ ఇచ్చింది. ఆ సమయంలో సెలబ్రిటీలతో పాటు అభిమానులు కూడా ఆమెకు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ఏమైందో ఏమో కానీ, ఇప్పుడు ఆమె తన అఫీషియల్ సోషల్ మీడియా ఖాతాల నుండి ఆ నిశ్చితార్థపు ఫోటోలను, అలాగే తన ప్రియుడికి సంబంధించిన పోస్టులన్నింటినీ పూర్తిగా డిలీట్ చేసింది. దీంతో వీరిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి బ్రేకప్ అయిందని ఇండస్ట్రీ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. పెళ్లి పీటలు ఎక్కాల్సిన ఈ జంట ఇలా హఠాత్తుగా విడిపోవడానికి గల కారణాలు మాత్రం ఇంకా తెలియరాలేదు. ఇలా నిశ్చితార్థం తర్వాత ఫోటోలు తొలగించడం ద్వారా తమ బ్రేకప్ విషయాన్ని పరోక్షంగా నెటిజన్లకు హింట్ ఇచ్చిందని టాక్ నడుస్తోంది. దీనిపై సునయన ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి ప్రకటన చేయలేదు. నాగ్‌పూర్‌కు చెందిన సునయన కన్నడ చిత్రం ద్వారా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత సిటెన్త్ క్లాస్, మిస్సింగ్, వేటాడు వెంటాడు, ఎంతవరకు ఈ ప్రేమ, రాజ రాజ చోర, లాఠీ వంటి సినిమాలతో మెప్పించింది. 2005లో తెలుగులో కుమార్ వర్సెస్ కుమారి చిత్రంతో కథానాయికగా పరిచయమైంది. ఆ తర్వాత తెలుగు, మలయాళం, కన్నడ భాషలలో పలు చిత్రాల్లో నటించి మెప్పించింది.

నా పరువుకు నష్టం కలిగించేలా


# తప్పుడు ప్రచారం..

## గంగూలీ ఫిర్యాదు



సోషల్ మీడియాలో తన పరువుకు నష్టం కలిగించే కంటెంట్ ప్రచారం అవుతోం దని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ కోల్‌కతా పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'సౌరభ్ గంగూలీ ఫ్యాన్స్' అనే అనధికార ఫేస్ బుక్ పేజీతోపాటు మరో మీడియా సంస్థ తన ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కల్పిత సమాచారాన్ని ప్రచారం చేస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. “నా ప్రతిష్ఠను దెబ్బతీసి ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించే ఉద్దేశంతో ఆ పేజీ నిరంతరం పోస్టులను షేర్ చేస్తోంది. ఒక ప్రముఖ వ్యక్తిగా అభిప్రాయాలు, విమర్శలు ప్రజా జీవితంలో భాగమని నాకు తెలుసు. అయితే, నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టించే, పరువుకు నష్టం కలిగించే కంటెంట్‌ను ప్రచారం చేయడం ఆమోదయోగ్యం కాదు. ఈ పేజీని నిర్వహిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి” అని గంగూలీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

# టీజీ20 లీగ్.. బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ




తెలంగాణలో యువ క్రికెటర్ల ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా హెచ్‌సీఏ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ప్రారంభానికి రంగం సిద్ధమైంది. జూన్ 21 నుంచి మొదలుకానున్న ఈ టోర్నీకి ప్రముఖ నటుడు విజయ్ దేవరకొండ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. టైటిల్ స్పాన్సర్‌గా శ్రీనిధి యూనివర్సిటీ ఎంపికయింది. లీగ్ ఆరంభానికి సమయం దగ్గరపడటంతో అభిమానులను ఆకర్షించడానికి హెచ్‌సీఏ, ఫ్రాంఛైజీలు ప్రచార కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నాయి. బుధవారం ట్యాంక్‌బండ్‌పై ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇటీవల నెక్లెస్ రోడ్‌లో హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డ్రోన్ డిస్‌ప్లే షోలో జట్ల లోగోలను నిర్వాహకులు ప్రదర్శించారు. లీగ్‌లో ఎనిమిది జట్లు పోటీపడుతుండగా.. ప్రతి జట్టు మిగతా అన్ని టీమ్‌లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. తొలి మ్యాచ్‌లో పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ తలపడనున్నాయి. జూన్ 23న పాలమూరుతో జరిగే మ్యాచ్‌తో హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తలపడనుంది. బేగంపేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హెచ్‌సీఏ కార్యదర్శి జీవన్ రెడ్డి, టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు, హెచ్‌సీఏ, ఫ్రాంఛైజీల యాజమానులు హాజరయ్యారు. టీజీ20 గవర్నింగ్ కౌన్సిల్ ఛైర్మన్ ఆగం రావు లీగ్ వివరాలను వెల్లడించారు. విజేత జట్టుకు రూ.కోటి నగదు బహుమతి, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ.50 లక్షలు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లను రూ.25 లక్షల చొప్పున ప్రైజ్‌మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో తొలి మ్యాచ్‌కు ముందు వేడుకలు ఉంటాయన్నారు. సంగీత దర్శకుడు తమన్ మ్యూజిక్ కాన్సర్ట్, లేజర్ షో ఉంటుందని పేర్కొన్నారు. ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ తప్ప ఐపీఎల్‌లోని అన్ని రూల్స్ ఈ లీగ్‌లో ఉంటాయని.. డిస్ట్రిక్ యాప్‌లో టికెట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. టికెట్ల ధరలు రూ.50, రూ.100గా నిర్ణయించామన్నారు. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ తరఫున హాజరైన ఈటీవీ భారత్ డైరెక్టర్ బృహతి మాట్లాడారు. “టీజీ20 లీగ్ రూపంలో అవకాశం రావడం ఆనందంగా ఉంది. ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్, రామోజీ గ్రూపు ఎల్లప్పుడూ క్రీడలను ప్రోత్సహిస్తాయి. క్రికెట్ ఛాంపియన్ షిప్, లక్ష్య వంటి కార్యక్రమాలు చేపడుతూ క్రీడాకారులకు మద్దతుగా నిలుస్తున్నాయి. హైదరాబాద్ ఈ ఛాంపియన్స్‌తో పాటు అన్ని ఫ్రాంఛైజీలు ఆటగాళ్ల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించాలి. ఆ ప్లేయర్లు జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేయాలి. అందరం కలిసి ఈ లీగ్‌ను మరింత ముందుకు తీసుకెళ్దాం” అని అన్నారు.

నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నమెంట్..

# సెమీస్‌లో భారత్



నేషన్స్ కప్ మహిళల హాకీ టోర్నమెంట్లో భారత్ సెమీస్‌కు దూసుకెళ్లింది. మంగళవారం ఆక్లాండ్‌లోని నార్త్ హార్బర్ నేషనల్ హాకీ సెంటర్‌లో జరిగిన పూల్ ఎ రెండో మ్యాచ్‌లో భారత్ 2-1 తేడాతో జపాన్‌ను ఓడించింది. భారత్ తరఫున కెప్టెన్ సలీమా టెటే 33వ నిమిషంలో, ఫార్వర్డ్ లాల్‌రెమ్‌సియామి 49వ నిమిషంలో గోల్స్ చేశారు. ప్రత్యర్థి జట్టులో హిరామిట్సు 35వ నిమిషంలో గోల్ చేసింది. వరుసగా రెండు విజయాలు సాధించి పూల్ ఎలో ఆరు పాయింట్లతో భారత్ అగ్రస్థానంలో ఉంది. జూన్ 18న జరిగే తమ చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో ఉరుగ్వేతో తలపడనుంది.

వరుసగా రెండు ఓటములు..

# అఫ్గాన్ చేతిలో ఇండియా 'ఎ' భవితవ్యం



శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత్ 'ఎ' జట్టు ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. వైభవ్ సూర్యవంశీ, ప్రభ్‌సిమ్రన్ సింగ్, ప్రియాంశ్ ఆర్య, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ వంటి ప్రతిభావంతులున్నా ఇండియా 'ఎ' జట్టు ఆశించిన ప్రదర్శన చేయట్లేదు. దీంతో జట్టు టైటిల్ గెలవడం కాదు కదా కనీసం ఫైనల్‌కు చేరడం కూడా కష్టంగా కనిపిస్తోంది. తిలక్ వర్మ సారథ్యంలోని ఈ యువ జట్టు శ్రీలంక 'ఎ'పై ఓటమి అంచుల వరకు వెళ్లి చివరకు ఎనిమిది పరుగుల తేడాతో గట్టెక్కింది. తర్వాత అఫ్గాన్‌తో మ్యాచ్‌లో బ్యాటర్లు రాణించినా బౌలర్లు చేతులెత్తేశారు. దీంతో ఆ మ్యాచ్‌లో భారత్ ఋూ ప్రకారం 4 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. ఇక, తాజాగా శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ నిరాశపర్చడంతో భారత్ భారీ స్కోరు చేయలేకపోయింది. బౌలింగ్ దళం కాస్త మెరుగైన ప్రదర్శన చేయడంతో మ్యాచ్ సూపర్ ఓవర్ దాకా వెళ్లినా చివరకు ఓటమే ఎదురైంది.

**ఫైనల్‌కు చేరుతుందా?**

ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇండియా ఎ జట్టు ఫైనల్‌కు చేరాలంటే బుధవారం అఫ్గాన్‌తో ఆడాల్సిన చివరి మ్యాచ్‌లో తప్పక గెలవాలి. అది కూడా భారీ విజయమై ఉండాలి. అలా అయితేనే భారత్ ఎ ఫైనల్ చేరే అవకాశాలుంటాయి. ఒకవేళ అఫ్గానిస్థాన్ చేతిలో ఓడితే తిలక్ సేన ఇంటిముఖం పట్టాల్సిందే. అదే సమయంలో అఫ్గాన్ తమ చివరి మ్యాచ్‌లో శ్రీలంకపై భారీ తేడాతో గెలిస్తే సమీకరణాలు మరింత క్లిష్టంగా మారతాయి. ఎందుకంటే అఫ్గానిస్థాన్‌పై ఇండియా.. శ్రీలంకపై అఫ్గాన్ విజయం సాధిస్తే అప్పుడు మూడు జట్లూ నాలుగేసి పాయింట్లతో ఉంటాయి. మెరుగైన నెట్ రన్‌రేట్ ఉన్న మొదటి రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ఒకవేళ అఫ్గాన్ చివరి రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోతే భారత్, శ్రీలంక ఫైనల్‌లో తలపడతాయి.

**ఇండియా ఎ జట్టులోకి అశోక్ శర్మ**

ఇండియా ఎ జట్టులోకి ఫాస్ట్‌బౌలర్ అశోక్ శర్మను తీసుకున్నారు. ఈ ముక్కోణపు సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని యుధ్వీర్ సింగ్ భుజం గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలిగాడు. అతడి స్థానంలో అశోక్‌ను ఎంపిక చేశారు. ఐపీఎల్ 2026లో గుజరాత్‌కు ఆడిన అశోక్.. ఓ మ్యాచ్‌లో 154.2 కి.మీ. వేగంతో బంతిని విసిరి వార్తల్లో నిలిచాడు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైమ్ వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com